
షణ్ముఖ SHANMUKHAVELUGU APTEL 16448

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు తెలుగు దినపత్రిక




సంపుటి : 1 సంచిక : 276 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ బుధవారం 21 ఆగస్టు 2024 పేజీలు 8 : వెల 5/- ఒంగోలు

VOLUME : 01 ISSUE : 276 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Wednesday 21 August 2024 PAGES : 8 PRICE : 5/-



## జగన్ కేసులపై విచారణ
# మరోసారి వాయిదా

- ఇప్పటికే జగన్‌తో పాటు సీబీఐకి తెలంగాణ హైకోర్టు నోటీసులు జారీ
- జగన్ కేసులప త్వరితగతిన విచారణ జరపాలని హరిరామ జోగయ్య పిల్ దాఖలు
- కేసు విచారణ నుంచి జస్టిస్ సంజయ్ కుమార్ తప్పుకొంటున్నట్టు ప్రకటించిన విషయం తెలిసిందే..

**హైదరాబాద్/అమరావతి**

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అక్రమాస్తుల కేసుల విచారణ మరోసారి వాయిదా పడింది. జగన్ అక్రమాస్తుల కేసుల విచారణను వేగవంతం చేయాలన్న పిల్‌పై తెలంగాణ హైకోర్టులో మంగళవారం విచారణ జరిగింది. జగన్ కేసులప త్వరితగతిన విచారణ జరపాలని హరిరామ జోగయ్య పిల్ దాఖలు చేశారు. ఇప్పటికే - మిగతా3లో

## గ్రామాల్లో మళ్లీ అభివృద్ధి
# వెలుగులు



## గ్రామీణ పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక యాప్

- పంచాయతీరాజ్ శాఖను బలోపేతం చేస్తాం
- ఒక ఇంటికి, ఒక గ్రామానికి, ఒక ప్రాంతానికి ఏం అవసరమో గుర్తించి.. ఆ సదుపాయాలను కల్పిస్తాం
- పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 990 కోట్లు, జల్ జీవన్ మిషన్ పథకానికి రాష్ట్ర వాటా రూ. 500 కోట్లు విడుదల చేస్తాం
- స్థానిక సంస్థలకు రూ.1,452 కోట్ల నిధులు..
- పంచాయతీలకు స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవ వ్యయం పెంపు
- ఈ నెల 23న గ్రామ సభలు నిర్వహిస్తున్నట్టు సీఎంకు వివరించిన పవన్

**అమరావతి**

పంచాయతీ రాజ్ శాఖపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా మాట్లాడిన సీఎం.. గ్రామాల్లో మళ్లీ అభివృద్ధి వెలుగులు నింపుతామని అన్నారు. పంచాయతీరాజ్ శాఖను బలోపేతం చేస్తామన్నారు. ఒక ఇంటికి, ఒక గ్రామానికి, ఒక ప్రాంతానికి ఏం అవసరమో గుర్తించి.. ఆ సదుపాయాలను కల్పిస్తామని సీఎం చంద్రబాబు చెప్పారు. వచ్చే జనవరి నుంచి జన్మభూమి 2.0 కార్యక్రమం - మిగతా3లో

## ఏపీలో ఒకేరోజు పెద్దసంఖ్యలో
# గ్రామసభలు



- ఒకేరోజున 13326 పంచాయతీలలో గ్రామసభలు నిర్వహించాలని నిర్ణయం
- 23న అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరు మండలం మైసూరి వారిపల్లె గ్రామసభలో పాల్గోనున్న డిప్యూటీ సీఎం
- డిప్యూటి సీఎం పర్యటన నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లలో నిమగ్నం

**అన్నమయ్య**

గ్రామ సభలపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కీలక ఆదేశాలు జారీ చేశారు. ఒకేరోజున 13326 పంచాయతీలలో గ్రామసభలు నిర్వహించాలని నిర్ణయించారు. ఈనెల 23న రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ సభలు జరుగనున్నాయి. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ రైల్వేకోడూరులో జరిగే గ్రామసభకు హాజరుకానున్నారు. 23న అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరు మండలం మైసూరి వారిపల్లె గ్రామసభలో డిప్యూటీ సీఎం పాల్గొంటారు. మోడల్ పంచాయతిగా మైసూరివారిపల్లె నిలిచింది. డిప్యూటి సీఎం పర్యటన నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. కాగా.. గ్రామసభపై సోమవారం రాష్ట్ర సచివాలయం నుంచి జిల్లా పరిషత్ సీఈఓలు, డీపీఓలు, డ్వామా పీడీలు, ఎంపీడీఓలు - మిగతా3లో



## తొలి విడత ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల

- తొలి విడత ఎన్నిక పోలింగ్‌కు నోటిఫికేషన్ విడుదల చేసిన సీఈసీ
- తొలి విడతలో మొత్తం 24 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు..
- జమ్మూ కశ్మీర్ అసెంబ్లీకి తొలి విడత పోలింగ్ సెప్టెంబర్ 18న జరగనుంది.

## ఏపీలో విస్తరణకు
# హెచ్‌సీఎల్ గ్రీన్ సిగ్నల్



- 15వేల ఉద్యోగాల కల్పన దిశగా అడుగులు
- ఐటీ శాఖ మంత్రి లోకేశ్‌తో హెచ్‌సీఎల్ ప్రతినిధుల బృందం భేటీ
- ఏపీలో కార్యకలాపాల విస్తరణకు హెచ్‌సీఎల్ సంసిద్ధత
- ప్రస్తుతం ఏపీలో హెచ్ సీఎల్‌లో 4,500 మంది ఉద్యోగులు
- కొత్త కార్యాలయం నిర్మించేందుకు హెచ్ సీఎల్ ఆసక్తి
- అన్ని అనుమతులు మంజూరు చేస్తామన్న నారా లోకేశ్

**అమరావతి**

ఆంధ్రప్రదేశ్‌లో హెచ్‌సీఎల్ విస్తరణకు సన్నాహాలు చేస్తోంది. ఇందులో భాగంగానే రాష్ట్రంలో 15 వేల వరకు ఉద్యోగాల కల్పనకు అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్‌తో హెచ్‌సీఎల్ కార్పొరేట్ వైస్ ప్రెసిడెంట్ శివశంకర్, అసోసియేట్ వైఎస్ ప్రెసిడెంట్ శివప్రసాద్‌లు మంగళవారం భేటీ అయ్యారు. గత తెలుగుదేశం ప్రభుత్వ - విగతా3లో



## బాలినేని పిటిషన్‌పై హైకోర్టులో
# విచారణ వాయిదా

- ఒంగోలులో నిన్న ఈవీఎంల రీవెరిఫికేషన్
- వాకౌట్ చేసిన మాజీ మంత్రి బాలినేని ప్రతినిధులు
- నిలిచిన రీవెరిఫికేషన్ ప్రక్రియ
- హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన బాలినేని

**విజయవాడ**

ఈవీఎంల రీవెరిఫికేషన్ పై అభ్యంతరాలు ఉన్నాయంటూ వైసీపీ నేత, ఒంగోలు మాజీ ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ఏపీ హైకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. మాక్ పోలింగ్ వద్దని, 12 పోలింగ్ కేంద్రాల్లోని ఈవీఎంలలో - మిగతా3లో

## ఆర్టీఐ చట్టంతో తగ్గనున్న
# తల్లిదీవెన ప్రారంభం



- ఆర్థిక అంశాలతో ముడిపడిన హామీలపై మాత్రం రెండున్నర నెలలుగా మదనపడుతూన్న చంద్రబాబు
- తల్లికి వందనం ప్రధాన హామీగా
- అమ్మఒడి స్థానంలో బడికి వెళ్లే ప్రతి విద్యార్థికి ఏటా రూ.15వేల చొప్పున చెల్లిస్తామని టీడీపీ మిత్రపక్షాల తరపున హామీ

**విజయవాడ**

అధికారంలోకి వచ్చిన వెంటనే పెన్షన్ల పెంపుతో పాటు డిఎస్సీ నియామకాల వంటి హామీలను ముఖ్యమంత్రి చంద్రబాబు నెరవేర్చినా ఆర్థిక అంశాలతో ముడిపడిన హామీలపై మాత్రం రెండున్నర నెలలుగా మదనపడుతూనే ఉన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో గత మేలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి తరపున ఇచ్చిన హామీల్లో తల్లికి వందనం ప్రధాన హామీగా ఉంది. అమ్మఒడి స్థానంలో బడికి వెళ్లే ప్రతి విద్యార్థికి ఏటా రూ.15వేల చొప్పున చెల్లిస్తామని టీడీపీ మిత్రపక్షాల తరపున హామీ ఇచ్చారు. ఏపీలో 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ అమ్మఒడి పథకానికి ప్రాధాన్యత ఇచ్చింది. తొలి ఏడాది విద్యార్థుల తరపున తల్లుల ఖాతాలకు రూ.15వేలు జమ చేశారు. ఐదేళ్లలో నాలుగుసార్లు అమ్మఒడి నిధులు చెల్లించారు. జగనన్న అమ్మఒడి పథకం ద్వారా రాష్ట్రంలో నాలుగేళ్లలో 44,48,865మంది మహిళలకు ఏటా రూ.15వేల రుపాయల నగదు బదిలీ అమలు చేశారు. వసతిదీవెప పథకంలో ఉన్నత చదువుల కోసం హాస్టళ్లలో ఉండే వారి కోసం 25,17,245మందికి పథకాన్ని వర్తింప చేశారు. జగనన్న విద్యా దీవెన పథకంలో 26,98,728మందికి ప్రయోజనం దక్కింది. ప్రత్యక్ష నగదు బదిలీ పథకాల్లో ప్రధానంగా జగనన్న అమ్మఒడి పథకంలో - మిగతా3లో

# గ్రామాల్లో మళ్లీ అభివృద్ధి వెలుగులు

-మొదటిపేజీ తరువాయి

నిర్వహిస్తామన్నారు. గ్రామాభివృద్ధిలో ప్రజలను భాగస్వామ్యం చేస్తామని సీఎం తెలిపారు. పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 990 కోట్లు, జల్ జీవన్ మిషన్ పథకానికి రాష్ట్ర వాటా రూ. 500 కోట్లు విడుదల చేస్తామని సీఎం చెప్పారు. కాగా, ఈ సమీక్షా సమావేశంలో ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, సంబంధిత శాఖా అధికారులు పాల్గొన్నారు. పంచాయతీరాజ్ శాఖలో తీసుకుంటున్న నిర్ణయాలు, సంస్కరణలను సీఎంకు వివరించారు డిప్యూటీ సీఎం. గ్రామ పంచాయతీలకు స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవ కార్యక్రమాల వ్యయం పెంపుపై నిర్ణయం తీసుకున్నారు. వేడుకల వ్యయాన్ని రూ.10 వేల నుంచి 25 వేలకు పెంచినట్టు సమీక్షలో వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్యం నిర్వహణకు ప్రత్యేక మొబైల్ యాప్ తీసుకువచ్చారు. మొబైల్ యాప్ రూపొందించి, గ్రామీణ పారిశుద్ధ్యాన్ని పర్యవేక్షిస్తున్నట్టు గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇద్దరు కంటే ఎక్కువ పిల్లలు ఉంటే పోటీకి అనర్హత నిబంధన ఎత్తివేయాలని నిర్ణయించారు. ఈ మేరకు సీఎం చంద్రబాబు వెల్లడించారు. దీనిపై కేబినెట్ లో చట్ట సవరణ బిల్లు కూడా ఆమోదించినట్టు తెలిపారు. స్థానిక సంస్థల ప్రతినిధులకు గౌరవ వేతనం పెంపు అంశం కూడా నేటి సమీక్ష సమావేశంలో చర్చకు వచ్చింది. దీనికి



సంబంధించిన ప్రతిపాదనలను పంచాయతీరాజ్ శాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించింది.

ఇక, ఈ నెల 23న రాష్ట్రవ్యాప్తంగా గ్రామ సభలు నిర్వహిస్తున్నట్టు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సీఎం చంద్రబాబుకు వివరించారు. 13,326 పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు.

**సీఎం చంద్రబాబుతో ప్రపంచ బ్యాంక్, ఏడీబీ ప్రతినిధుల భేటీ..**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడితో ప్రపంచ బ్యాంక్, ఏడీబీ ప్రతినిధులు భేటీ అయ్యారు. రాజధాని అమరావతి నిర్మాణానికి నిధులు అందించే విషయమై చర్చించనున్నారు. అమరావతి నిర్మాణానికి రూ. 15వేల కోట్ల నిధులు అందిస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బ్యాంకు ప్రతినిధులు కలవడం ప్రాధాన్యత సంతరించుకుంది. కాగా, ఈ భేటీలో ప్రాథమికంగా అమరావతిలో చేపట్టాల్సిన పనులు, దశలవారీగా నిధులు విడుదల చేయడంపై చర్చించారు. అలాగే, అమరావతి ప్రాజెక్టులో పనుల పురోగతి, క్షేత్ర స్థాయి పర్యటనలు, భూ సమీకరణ, మౌళిక సదుపాయాలు, పెట్టుబడుల అంశాలపై చర్చించారు. రాజధాని పరిధిలో ప్రభుత్వ ప్రాధాన్యత ప్రాజెక్టులు, విధాన నిర్ణయాలను ప్రపంచ బ్యాంక్, ఏడీబీ ప్రతినిధులకు సీఎం చంద్రబాబు వివరించారు. కాగా, సీఆర్డీఏ పరిధిలో క్షేత్ర స్థాయిలో పర్యటించారు ప్రపంచ బ్యాంక్, ఏడీబీ ప్రతినిధులు. ఈ నెల 27వ తేదీ వరకు ప్రపంచ బ్యాంక్, ఏడీబీ ప్రతినిధులు పర్యటించనున్నారు.

**స్థానిక సంస్థలకు రూ.1,452 కోట్ల నిధులు..**

ఇదిలాఉంటే.. స్థానిక సంస్థల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ. 1,452 కోట్ల నిధులు విడుదల చేసింది. స్థానిక సంస్థల బలోపేతమే కూటమి ప్రభుత్వ లక్ష్యం అని.. సీఎం చంద్రబాబు సూచనల మేరకు నిధులు విడుదల చేసినట్లు రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. గత ప్రభుత్వం స్థానిక సంస్థలను పూర్తిగా నిర్వీర్యం చేస్తే.. తాము బలోపేతం చేస్తున్నామన్నారు

# ఏపీలో విస్తరణకు హెచ్‌సీఎల్ గ్రీన్ సిగ్నల్

-మొదటిపేజీ తరువాయి

హయాంలో ఏపీలో కార్యకలాపాలు ప్రారంభించిన హెచ్‌సీఎల్ సంస్థలో 4,500 మందికి ఉద్యోగాలు లభించాయి. విస్తరణ ద్వారా రాష్ట్రంలో మరో 5,500 మందికి ఉద్యోగాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు సంస్థ ప్రతినిధులు మంత్రికి వివరించారు. ఫేజ్ %–%2లో భాగంగా నూతన కార్యాలయం నిర్మాణం చేపట్టి మరో 10వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని వెల్లడించారు. ఐటీలో ప్రస్తుతం అంతర్జాతీయంగా చోటుచేసుకున్న ట్రెండ్స్‌కు అనుగుణంగా అధునాతన సాంకేతిక సేవలను అందుబాటులోకి తేవడం ద్వారా పెద్ద ఎత్తున ఉద్యోగాలు కల్పించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు వారు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టబోతున్న స్కిల్ సెన్సస్, సిల్క్ డెవలప్‌మెంట్‌లో తాము కూడా భాగస్వామ్యం వహిస్తామని ప్రకటించారు. రాష్ట్రంలో 20లక్షల మందికి ఉద్యోగాలు కల్పించాలన్న ప్రభుత్వ లక్ష్యానికి తమవంతు



సహాయ, సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. విస్తరణకు కావాల్సిన కొన్ని అనుమతులు, గత ప్రభుత్వం నిలిపివేసిన రాయితీలు విడుదల చేయాల్సిందిగా హెచ్‌సీఎల్ ప్రతినిధులు మంత్రి లోకేశ్ ని కోరారు.

భారీగా ఉపాధి కల్పనకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. అంతేకాదు, స్కిల్ డెవలప్ మెంట్, నైపుణ్య గణన కార్యక్రమాల్లోనూ భాగస్వామ్యం అవుతామని హెచ్ సీఎల్ ప్రతినిధులు పేర్కొన్నారు. ఉపాధి కల్పనలో ప్రభుత్వ లక్ష్యానికి తోడ్పాటు అందిస్తామని చెప్పారు.

ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ స్పందిస్తూ... గత ప్రభుత్వ పాలనలో హెచ్ సీఎల్ కార్యకలాపాలు ముందకు సాగలేదని తెలిపారు. పూర్తి అనుమతులు, రాయితీలు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టారని ఆరోపించారు.

హెచ్ సీఎల్ విస్తరణకు తమ ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని లోకేశ్ హామీ ఇచ్చారు. హెచ్ సీఎల్ కు అవసరమైన అనుమతులు త్వరితగతిన మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం పెండింగ్ లో ఉంచిన రాయితీలను దశల వారీగా చెల్లిస్తామని చెప్పారు.

# ఆర్టీఐ చట్టంతో తగ్గనున్న తల్లిదీవెన ప్రారంభం

-మొదటిపేజీ తరువాయి

44,48,865మందికి రూ.26,067.30కోట్లను జమ చేశారు. జగనన్న వసతి దీవెనలో 25,17,245మందికి రూ.4,275.76 కోట్లను అందించారు. జగనన్న విద్యా దీవెన పథకంలో 26,98,728మందికి రూ.12,609.68కోట్లను అందించారు. జగనన్న విదేశీ విద్యా దీవెన పథకంలో 408మందికి రూ.107.07కోట్లను ఇచ్చారు.అమ్మఒడి పథకం కంటే మెరుగైన నగదు బదిలీ పథకాన్ని అందిస్తామని ఎన్నికల ప్రచారంలో టీడీపీ ప్రకటించింది. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా దారిద్ర్య రేఖకు దిగువున ఉండి అర్హులైన ప్రతి ఒక్కరికి ఆర్థిక సాయం అందిస్తామని ప్రకటించారు. ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉన్నా వారికి నగదు చెల్లిస్తామని ప్రకటించారు.దేశంలో 2009 పార్లమెంటులో చట్టంగా మారిన రైట్ ఎడ్యుకేషన్ యాక్ట్ ప్రకారం విద్య అనేది లాభాపేక్ష రహితమైన కార్యక్రమం. విద్యను వ్యాపార కార్యక్రమంగా నిర్వహించడం ఆర్టీఈ చట్ట ప్రకారం నిషిద్ధం. ఆర్టీఈ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేస్తే ప్రభుత్వంపై గణనీయంగా భారం తగ్గుతుంది. దేశంలో విద్య, వైద్య సేవలు డబ్బుతో ముడిపడి ఉన్న అంశాలు కావడంతో వాటిని ఉమ్మడి జాబితాలో పొందుపరిచారు.విద్యా సంస్థలకు అనుమతులు జారీ చేయడం మొదలుకుని వాటి నియమనిబంధనల వరకు ప్రభుత్వం చేతిలోనే ఉంటాయి. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందడం లేదనే కారణాలతో ప్రైవేట్ పాఠశాలల వైపు మొగ్గు చూపుతున్నా వాటిని కట్టడి చేసే ప్రయత్నాలు మాత్రం విద్యా రంగంలో జరగడం లేదు. ప్రైవేట్ స్కూళ్లలో చదువులకు కూడా అమ్మఒడి వంటి పథకాలను అమలు చేసి ప్రైవేట్ విద్యను గణనీయంగా ప్రోత్సహించారు.విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రతి ప్రైవేట్ పాఠశాలలో శాతం 25శాతం సీట్లను తప్పనిసరిగా ఉచితంగా విద్యార్థులకు కేటాయించాల్సి ఉంటుంది. నాణ్యమైన విద్య కోసమే ప్రైవేట్ పాఠశాలల్ని అన్ని వర్గాల విద్యార్థులు ఆశ్రయిస్తున్న సమయంలో ఆర్టీఈ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేస్తే విద్యార్థులకు నగదు బదిలీ చేయాల్సిన అవసరం కూడా ఉండకపోవచ్చు.ప్రైవేట్ స్కూళ్లలో విద్యను కొనుగోలు చేయడానికి ప్రభుత్వం పేదలకు నగదు బదిలీ చేసే బదులు, ఆర్టీఈ చట్టం ద్వారా నిర్బంధంగా 25శాతం సీట్లను పేదలకు కేటాయిస్తే ఆ మేరకు ప్రభుత్వంపై భారాన్ని తగ్గించుకోవచ్చు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో తప్పనిసరిగా 25శాతం సీట్ల కేటాయింపు అమలు కావడంతో లేదు. కానీ ఈ దిశగా చట్టం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు ఎలాంటి ప్రయత్నం జరగలేదు. విద్యా హక్కు చట్టం కింద జరిగిన అడ్మిషన్ల వివరాలను బయట పెట్టడానికి కూడా విద్యాశాఖ సుముఖత చూపలేదు.ఏపీలో ఆర్టీఈ చట్టం ద్వారా జిల్లాల వారీగా జరిగిన అడ్మిషన్ల వివరాలను వెల్లడించాలని కోరినా సమగ్రశిక్ష అధికారులు స్పందించలేదు. గత కొన్నేళ్లుగా ఈ చట్టాన్ని బుట్టదాఖలు చేసి ప్రైవేట్ విద్యా సంస్థలకు మేలు చేయడంలో సంబంధిత శాఖ అధికారులు లోపాయికారీగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 61,511 పాఠశాలలు ఉన్నాయి. వాటిలో ప్రభుత్వ పాఠశాలలు 44,407 ఉన్నాయి. ఎయిడెడ్ పాఠశాలలు 940 ఉన్నాయి. వైసీపీ ప్రభుత్వంలో ఎయిడెడ్ పాఠశాలల విషయంలో ఆంక్షలతో చాలా స్కూళ్ల ప్రైవేట్ స్కూళ్లుగా మారిపోయాయి. ఉపాధ్యాయుల్ని ప్రభుత్వానికి అప్పగించారు. ప్రైవేట్ పాఠశాలలు 13,359 ఉన్నాయి.మొత్తం పాఠశాలల్లో పదిమందిలోపు విద్యార్థులు ఉన్న పాఠశాలలు 13,359 ఉన్నాయి. 20మందిలోపు విద్యార్థులు ఉన్నవి 12,252 ఉన్నాయి. ఈ విద్యా సంవత్సరంలో ప్రైమరీలో చేరిన విద్యార్థుల సంఖ్య 101.66శాతం ఉంటే, అప్పర్ ప్రైమరీలో 97.62శాతం, సెకండరీలో 85.38శాతం, ఇంటర్‌లో 56.7శాతం ఉన్నారు. ప్రభుత్వ టీచర్లు లక్షా 78 వేల 778మంది ఉంటే ఖాళీలు 22,776 ఉన్నాయి.పేదలకు నాణ్యమైన విద్యను అందించడం, చదువుకు ఏ ఒక్కరు దూరం కాకూడదనే ఆలోచనలతో పుట్టిన ఆర్టీఈ చట్టం చాలా సమస్యలకు పరిష్కారం చూపుతుంది. విద్యా రంగంలో నెలకున్న అనైతిక విధానాలు, విద్యను వ్యాపారంగా మార్చేయడమే శాపాలుగా మారాయి.ఫీజుల నియంత్రణ విషయంలో సైతం విద్యాశాఖ గత ఐదేళ్లలో ఎలాంటి చర్యలు తీసుకోలేక పోయిందనే విమర్శలు ఉన్నాయి. మరోవైపు ఎన్నికల హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందనే ప్రత్యర్థుల విమర్శలకు చెక్ పెట్టడానికి ఆర్టీఈ చట్టాన్ని సమర్థవంతంగా వినియోగించుకునే అవకాశం పరిష్కారంగా కనిపిస్తోంది.ఏపీ ప్రభుత్వం దీనిపై దృష్టి పెడితే కొంత మేరకైనా ఆర్థిక భారాన్ని తగ్గించుకోవచ్చు. పిల్లల్ని చదివించినందుకు ఇస్తున్న ప్రోత్సాహకం ప్రైవేట్ విద్యా సంస్థల పరమవుతున్నందున 25శాతం నిర్బంధ కోటాను అన్ని పాఠశాలల్లో ఖచ్చితంగా అమలు చేస్తే ప్రయోజనం ఉంటుంది.

# రహస్య ప్రాంతంలో కొనసాగుతున్న వాసుదేవరెడ్డి విచారణ

**విజయవాడ :** కూటమి ప్రభుత్వం ఏర్పాటు తరువాత ఇటీవల ఏపీలో అరెస్టుల పర్వం మొదలైంది. జోగి రమేష్ కుమారుడు జోగి రాజీవ్ ను పోలీసులు ఇటీవల అరెస్ట్ చేశారు. తాజాగా ఏపీ బేవరీజెస్ కార్పొరేషన్ మాజీ ఎండీ వాసుదేవరెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. ఏపీ సీఐడీ అధికారులు వాసుదేవరెడ్డిని అరెస్ట్ చేశారని సమాచారం. ఏపీలో మద్యం కుంభకోణంలో వాసుదేవరెడ్డి కీలక పాత్ర పోషించారని ఆరోపణలున్నాయి. ప్రస్తుతం ఓ అజ్ఞాత ప్రాంతంలో ఏపీ బేవరీజెస్ కార్పొరేషన్ మాజీ ఎండీని సీఐడీ అధికారులు ప్రశ్నిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో జే బ్రాండ్ మద్యం విక్రయాల విషయంపై వాసుదేవరెడిపై భారీ అభియోగాలు నమోదయ్యాయి.వైసీపీ హయాంలో సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అప్పట్లో డిప్యూటేషన్ పై వాసుదేవరెడ్డిని రప్పించారని వార్తలు వచ్చాయి. ఏపీలో మద్యం విక్రయాలు పెంచే బాధ్యత ఆయనకు జగన్ అప్పగించారని టీడీపీ నేతలు గతంలోనే ఆరోపించారు. దాంతో వాసుదేవరెడ్డి రాష్ట్రంలో డిస్టిలరీలు, డిపోలు, షాపులపై అజమాయిషీ చేశారు. ఇంకా చెప్పాలంటే ఏపీలో జే బ్రాండ్లు తీసుకురావటంలో వాసుదేవరెడ్డి కీలక పాత్ర పోషించారట. ఏపీలో మద్యంపై ఆదాయాన్ని ముందుగానే తాకట్టు పెట్టి వైసీపీ ప్రభుత్వం వేల కోట్లు అప్పులు తెచ్చిందని ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో ఏపీలో జరిగిన ఎన్నికల్లో వైసీపీ దారుణ ఓటమి చవిచూసింది. అధికారంలోకి వచ్చిన కూటమి పార్టీలు గత ఐదేళ్లలో జరిగిన పాలనలో లోపాలు, అవినీతిపై ఫోకస్ చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక వాసుదేవరెడ్డి అజ్ఞాతంలోకి వెళ్లగా.. 2 నెలల తరువాత ఏపీ సీఐడీ ఆయనను అరెస్ట్ చేసింది. వాసుదేవరెడ్డి అరెస్ట్ వార్త రాష్ట్ర వ్యాప్తంగా హాట్ టాపిక్ గా మారింది. వైసీపీ హయాంలో ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్‌లో భారీ అవినీతి జరిగిందని, ఎన్నికల అనంతరం కార్పొరేషన్ ఆఫీసు నుంచి ఫైళ్లు మాయం చేశారని వాసుదేవరెడ్డిపై సీఐడీ కేసు నమోదు చేసింది. తనను అరెస్ట్ చేయకుండా రక్షణ కల్పించాలని కోరుతూ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను విచారించిన ధర్మాసనం వాసుదేవరెడ్డికి మధ్యంతర బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించడం తెలిసిందే.ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం మె?గులూరుకు చెందిన శివకృష్ణ ఫిర్యాదుతో వాసుదేవరెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కార్పొరేషన్ నుంచి ఫైళ్లు తరలిస్తున్నట్లు చూశానని ఆ ఫిర్యాదులో శివకృష్ణ పేర్కొన్నారు. ఈ క్రమంలో ఏపీ సీఐడీ రంగంలోకి దిగింది. హైదరాబాద్‌లో వాసుదేవరెడ్డికి చెందిన ఓ ఖరీదైన విల్లాలో మూడు రోజులపాటు సోదాలు నిర్వహించారు. ఆయనకు సంబంధించిన నివాసాలలో సోదాల్లో భాగంగా కీలకమైన డాక్యుమెంట్లు, పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. రైల్వే ట్రాఫిక్ సర్వీస్ ఉద్యోగిగా ఉండే వాసుదేవరెడ్డి డిప్యూటేషన్ పై ఏపీ ప్రభుత్వానికి వచ్చారు. అప్పటి సీఎం వైఎస్ జగన్, వాసుదేవరెడ్డికి ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ ఎండీగా బాధ్యతలు అప్పగించారు. వైసీపీ నేతలకు సంబంధించిన డిస్టిలరీల నుంచి వచ్చే మద్యాన్ని విక్రయించేలా చూశారని, మద్యం ఆదాయం చూపించి రాష్ట్ర ప్రభుత్వం అప్పులు తెచ్చుకోవడంలోనూ వాసుదేవరెడ్డి కీలకంగా వ్యవహరించాలని టీడీపీ నేతలు ఆరోపించారు.

## బాలినేని పిటిషన్‌పై హైకోర్టులో విచారణ వాయిదా

-మొదటిపేజీ తరువాయి

ఓట్లు రీకౌంటింగ్ చేయాలని బాలినేని ఉన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. ఎన్నికల సంఘం సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఈ నేపథ్యంలో, బాలినేని పిటిషన్ పై హైకోర్టు నేడు విచారణ చేపట్టింది. అభ్యంతరాలు ఉన్న ఈవీఎంలలోని ఓట్లను లెక్కించాలని, వాటిని వీవీ ప్యాట్లతో సరిపోల్చాలని బాలినేని తరఫు న్యాయవాది విన్నవించారు. మాక్ పోలింగ్ పై ఇప్పటికే ఉత్తర్వులు ఉన్నాయని ఎన్నికల సంఘం తరపు న్యాయవాది వివరించారు. వాదనలు విన్న అనంతరం హైకోర్టు ధర్మాసనం తదుపరి విచారణను రేపటికి వాయిదా వేసింది.

## ఏపీలో ఒకేరోజు పెద్దసంఖ్యలో గ్రామాసభలు

-మొదటిపేజీ తరువాయి

తదితరులతో పవన్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ "పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖల్లో పనిచేయడమంటే గ్రామీణ ప్రాంతాల్లోని రైతులు, నిరుపేద కూలీలకు సేవ చేయడమేనని నేను నమ్ముతున్నా. ఈ నెల 23వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా ఒకే రోజు 13,326 పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించడం ద్వారా ప్రజలకు పలు అంశాలపై అవగాహన కల్పించనున్నాం. ముఖ్యంగా ఉపాధి హామీ పథకంలో ప్రతి కుటుంబానికీ సంవత్సరంలో 100రోజుల పని దినాలను కల్పిస్తున్న అంశంపై అవగాహన కల్పించడంతో పాటు, అధికారులు కూలీలకు గల హక్కుల గురించి తెలియజేసి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది" అని తెలిపారు. "ప్రజలందరూ అధిక సంఖ్యలో గ్రామ సభలో పాల్గొనేలా చూడాలి. గ్రామసభలు అర్థవంతంగా జరగాలంటే గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు, అధికారులు గ్రామ సభల్లో మనస్ఫూర్తిగా పాల్గొనాలి. గ్రామ సచివాలయాల్లో పనిచేసే అందరూ ఉద్యోగులు గ్రామ సభల్లో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనేలా చేసి సభలు విజయవంతానికి కృషి చేయాలి" అని పవన్ కోరారు.

## జగన్ కేసులపై విచారణ మరోసారి వాయిదా

-మొదటిపేజీ తరువాయి

జగన్‌తో పాటు సీబీఐకి తెలంగాణ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ప్రజాప్రతినిధుల కేసులను త్వరితగతిన జరపాలని సుప్రీంకోర్టు ఆదేశాలున్నాయని పిటిషనర్ వాదించారు. ఈ క్రమంలో పిటిషన్లపై విచారణను సెప్టెంబర్ 17కు తెలంగాణ హైకోర్టు వాయిదా వేసింది. మరోవైపు ఏపీ మాజీ సీఎం జగన్ అక్రమాస్తుల కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. కేసు విచారణ నుంచి జస్టిస్ సంజయ్ కుమార్ తప్పుకొంటున్నట్టు ప్రకటించిన విషయం తెలిసిందే.. జగన్ అక్రమాస్తుల కేసులకు సంబంధించి నమోదైన సీబీఐ కేసుల్లో తీర్పు వెలువడిన తర్వాతే ఈడీ కేసుల్లో తీర్పులు ఇవ్వాలని గతంలో తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. సీబీఐ, ఈడీ కేసులను విడివిడిగా లేదా సమాంతరంగా విచారించినా ఆ పద్ధతినే అనుసరించాలని అప్పట్లో స్పష్టం చేసింది. హైకోర్టు తీర్పును గతేడాది మే నెలలో ఈడీ సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. ఆగస్టు 14న ఈడీ పిటిషన్లపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. అయితే.. కేసు ప్రారంభమైన వెంటనే తాను విచారణ నుంచి తప్పుకొంటున్నానని జస్టిస్ సంజయ్ కుమార్ స్పష్టం చేశారు. వాదనలు వినిపించేందుకు ఇరుపక్షాల న్యాయవాదులు సిద్ధమవగా జస్టిస్ సంజీవ్ కుమార్ లేని ధర్మాసనం ముందు పిటిషన్‌ను లిస్ట్ చేయనున్నట్టు జస్టిస్ సంజీవ్ ఖన్నా వెల్లడించారు. సెప్టెంబరు 2 నుంచి మొదలయ్యే వారంలో సీజేఐ ఆదేశాల మేరకు మరో ధర్మాసనం ముందు లిస్ట్ చేయాలని ఆయన ఆదేశించారు.

## అనంతపురంలో అగ్రిగోల్డ్ చెట్లు మాయం...

**అనంతపురం :** వందలు వేలు కాదు, ఏకంగా కోట్ల ఖరీదు చేసే విలువైన వృక్ష సంపదకు రెక్కలొచ్చాయి. దాదాపు పదేళ్లుగా ఆలనపాలన లేకపోవడంతో కొందరు అక్రమార్కులకు కన్ను కుట్టింది. గుట్టు చప్పుడు కాకుండా వందల ఎకరాల్లో చెట్లను మాయం చేసేశారు. అసలు ఎక్కడ ఎంత సంపద ఉందో కూడా తెలియకుండా రికార్డులు తారుమారు చేసేశారనే ఆరోపణలు ఉన్నాయి.అగ్రిగోల్డ్ భూముల అక్రమ రిజిస్ట్రేషన్, సీఐడీ స్వాధీనంలో ఉన్న ఫ్యాక్టరీలో యంత్రపరికరాల చోరీ విషయం మరువక ముందే కోట్ల రుపాయల విలువైన వృక్షాలు మాయమైన వ్యవహారం వెలుగు చూసింది. 2015లో అగ్రిగోల్డ్ అక్రమాలపై ఏలూరులో కేసులు నమోదయ్యాయి. ఆ తర్వాత రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, ఒడిశా, అండమాన్ వంటి రాష్ట్రాల్లో కూడా ఈ వ్యవహారం పాకినట్టు గుర్తించారు.దాదాపు రెండు మూడేళ్ల పాటు సాగిన ప్రాథమిక దర్యాప్తులో వేల ఎకరాల భూముల్ని సీఐడీ అటాచ్ చేసింది. ఆ తర్వాత ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కూడా వీటిని జప్తు చేసింది. సీఐడీ, ఈడీలలో ఎవరికి అగ్రిగోల్డ్ ఆస్తులపై హక్కు ఉంటుందనే వివాదం ఇంకా కొలిక్కి రాలేదు. ఆ కేసులు అలా నడుస్తూనే ఉన్నాయి. మరోవైపు అగ్రిగోల్డ్ ఆస్తుల్ని అందినకాడికి దోచుకునే ప్రయత్నాలు మాత్రం జోరుగా సాగుతూనే ఉన్నాయి.అగ్రిగోల్డ్ ఆస్తుల స్వాధీనంలో భాగంగా రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో వందలాది ఎకరాలను అటాచ్ చేశారు. వీటిలో విలువైన వ్యవసాయ భూములు, ఓపెన్ ప్లాట్లు, కమర్షియల్ ప్లాట్లు ఉన్నాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఇలా వందలాది ఎకరాల భూమిని దర్యాప్తు సంస్థలు తమ స్వాధీనంలోకి తీసుకున్నాయి. అయితే ఎనిమిదేళ్లుగా వాటి బాగోగులు మాత్రం మరచిపోయారు.అగ్రిగోల్డ్ ఆస్తులను జప్తు చేయడానికి ముందే రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వందల ఎకరాల్లో శ్రీగంధం, చందనం, నీల్‌గిరి, సుబాబుల్ ప్లాంటేషన్లు చురుగ్గా నడిచాయి. తీర ప్రాంతాలు, పెద్దగా నీటి సదుపాయం లేని భూముల్లో పండే మొక్కల్ని పెంచుతూ వచ్చారు. కొన్ని చోట్ల శ్రీగంధం, ఎర్ర చందనం వంటి వాటిని కూడా సాగు చేశారు. ఎనిమిదేళ్లుగా ఈ మొక్కల్ని పట్టించుకున్న వారు లేరు.ప్రకాశం, కడప, అనంతపురం జిల్లాల్లో వందలాది ఎకరాల్లో సాగు చేసిన చెట్లు కోతకు రావడాన్ని కొందరు అధికారులు గుర్తించారు. అగ్రిగోల్డ్ ఆస్తుల్ని జప్తు చేసిన సమయంలోనే వాటిని జియోఫెన్సింగ్ చేసి సంరక్షించాలనే సంగతిని సీఐడీ గాలికి వదిలేసింది. దీంతో ఎన్నికల సమయంలో అంతా హడావుడిగా ఉన్న సమయంలో విలువైన చెట్లను నరికేసి సొమ్ము చేసుకున్నారు. ఈ వ్యవహారంలో ఓ ఐపీఎస్ అధికారి పాత్ర ఉందనే ఆరోపణలు ఉన్నాయి. ఎక్కడ ఎన్ని చెట్లను నరికేశారనే లెక్కలు ఇప్పటికీ లేవు.అగ్రిగోల్డ్ ప్లాంటేషన్లలో చెట్ల నరికివేతలపై కేసుల విచారణ జరుగుతున్న ఏలూరు కోర్టులో అగ్రిగోల్డ్ డైరెక్టర్లు కొద్ది రోజుల క్రితం పిటిషన్లు వేశారు. కోట్ల రుపాయల ఖరీదు చేసే మొక్కల్ని నరికివేస్తున్నా చర్యలు తీసుకోవడం లేదని వాటిని వేలం వేస్తే డిపాజిటర్లకు నగదు చెల్లించవచ్చని సూచించారు. ఈ వ్యవహారంపై న్యాయస్థానం పీపీని ప్రశ్నించడంతో బాధ్యులపై కేసులు నమోదు చేస్తామని చెప్పినా ఆ తర్వాత ఆ సంగతి వదిలేశారు.అనంతపురం జిల్లా పెనుకొండతో పాటు, రొద్దం మండలం పెద్ద గువ్వలపల్లిలో నీలగిరి చెట్లను నరికేసి అమ్మేశారు. ప్రకాశం జిల్లా పామూరు మండలం వెనిగొండ్లలో ఉన్న ప్లాంటేషన్ సైట్లో కూడా చెట్లను మాయం చేశారు. ఒక్కో ప్లాంటేషన్ యూనిట్ 100 నుంచి 200 ఎకరాల విస్తీర్ణంలో ఉంటుందని ఎన్నికల హడావుడిలో ఈ చెట్లను మొత్తం నరికి సొమ్ము చేసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి.మరోవైపు చెట్ల నరికివేతపై పోలీసులు కేసులు నమోదు చేస్తున్నట్టు సీఐడీ కోర్టులో పేర్కొన్నా చోరీకి గురైన చెట్ల విలువను ఎలా రాబడుతారనే దానికి మాత్రం సమాధానాలు లేవు. ఈ మొత్తం వ్యవహారం సీఐడీలో కీలక పాత్ర పోషించిన అధికారుల కనుసన్నల్లోనే జరిగిందనే ఆరోపణలు ఉన్నాయి.సత్యసాయి జిల్లా పెనుకొండ నియోజకవర్గం రొద్దం మండల పరిధిలోని పెద్దగువ్వలపల్లి గ్రామంలో ఉన్న 112 ఎకరాల అగ్రి గోల్డ్ భూముల్లో నీలగిరి చెట్లను ఇటీవల నరికేశారు. ఈ వ్యవహారంలో ఓ మహిళా మంత్రి చక్రం తిప్పారనే ఆరోపణలు ఉన్నాయి. అగ్రిగోల్డ్ భూముల్లో పెరుగుతున్న నీలగిరి చెట్లు కోతకు రావడంతో మంత్రి అనుచరులు వాటిని నరికి సొమ్ము చేసుకున్నారు. పగలు చెట్లను నరికి రాత్రిపూట కర్ణాటకకు అక్రమ రవాణా చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అటవీ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా ఈ వ్యవహారంపై అటవీ శాఖ, సీఐడీ చర్యలు తీసుకోకపోవడంతో కోర్టులో ఫిర్యాదు చేశారు.

షణ్ముఖ వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు తెలుగు దినపత్రిక
ప్రకాశం

# ట్రాఫిక్‌లో జిల్లా కలెక్టర్





## పొదిలిలో రోజు రోజుకు పెరిగి పోతున్న ట్రాఫిక్

**(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఆగస్టు 20)**

ట్రాఫిక్ సమస్య ఎవరికైనా ఒక్కటే...ఎవరైతే నాకేంటి అనే విధంగా వాహనదారులు ప్రవర్తిస్తున్నారు. ట్రాఫిక్ సమస్యతో పొదిలి పట్టణం సతమతమవుతుంది. అలాంటి ట్రాఫిక్ లో బుధవారం జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా చిక్కుకున్నారు. సుమారు పావుగంట పాటు జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా ఆ ట్రాఫిక్‌లో ఉండి పరిస్థితులను స్వయంగా పరిశీలించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని జాతీయ రహదారి ట్రాఫిక్‌తో ఉన్నతాధికారులే గాక ప్రజలు కుడా తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ట్రాఫిక్‌లో కలెక్టర్ చిక్కినా ఏ మాత్రం అధికార దర్పం చూపకుండా సైరెన్ కుడా వేయకుండా ట్రాఫిక్ క్లియర్ అయిన తరువాతే కలెక్టర్ తన కారును ముందుకు సాగించారు. రోడ్డు మార్జిన్‌లో ఆటోలు, తోపుడు బండ్లు, వ్యాపార సముదాయల బోర్డులు రోడ్డు మీదకు రావడంతో వాహనదారులు, పాదచారులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్న విషయం ఆమె నిశితంగా పరిశీలించారు. కొన్ని ప్రైవేట్ వాహనాలు రోడ్డు మార్జిన్‌లో పెట్టి, టీ తాగడానికి, టిఫెన్ చేయడానికి ఆపినప్పుడు ఎదురురెదురగా వస్తున్న వాహనాలు సైడు దింపలేక తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పొదిలి పట్టణంలోని ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

ఏకపక్ష ధోరణితో వెళితే తీవ్ర పరిణామాలు ఎదుర్కొంటారు

అధికార పార్టీకి కొమ్ముకాస్తున్న అధికారుల పై ఉన్నత స్థాయి అధికారులకు ఫిర్యాదులు చేస్తాం

వైకాపా సర్పంచ్‌లను ఉత్సవ విగ్రహాలుగా మారిస్తే ఊరుకునే పరిస్థితి లేదు

సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

# రాజకీయ పార్టీలకు అతీతంగా పనిచేయాలి

**(షణ్ముఖ వెలుగు, పెద్దారవీడు, ఆగస్టు 20)**



రాజకీయ పార్టీలకు అతీతంగా అధికారులు కొమ్ము కాస్తే పైన ఉన్నత స్థాయి అధికారులకు ఫిర్యాదు చేస్తామని ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. సోమవారం పెద్దారవీడు మండల ప్రజా పరిషత్తు కార్యాలయంలో ఎంపీపీ బెజవాడ పెద్ద గురవయ్య అధ్యక్షుడు సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ హాజరై మాట్లాడుతూ గ్రామ పంచాయతీలలో వైకాపా సర్పంచులకు తెలియకుండా అధికారులు తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తే ఊరుకునే ప్రసక్తి లేదని అన్నారు. అధికారులు రాజకీయ పార్టీలకు అతీతంగా పని చేయాలి ఏకపక్ష ధోరణితో వెళితే తీవ్ర పరిణామాలు ఎదుర్కొంటారని అన్నారు. గ్రామాలలో వైసిపి సర్పంచులను ఉత్సవిగ్రహాలుగా మారిస్తే ఊరుకునే ప్రసక్తే లేదని అన్నారు. ఈ సర్వసభ్య సమావేశానికి అధికారులు చాలామంది ఎగ్గొట్టారు. మూడు నెలలకు ఒకసారి జరుపుకునే ఈ సర్వసభ్య సమావేశానికి అధికారులు రాకపోవడంపై ఎమ్మెల్యే తాటిపర్తి హర్ష వ్యక్తం చేసి నోటీసులు పంపించాలని ఎంపీడీవోకు చెప్పారు. గ్రామాలలో ప్రధాన సమస్యగా ఎదుర్కొంటున్న త్రాగునీరు సంబంధించి అధికారులు రాకపోవడంపై ఎమ్మెల్యే అధికార పార్టీ కి కొమ్ము కాస్తే ఉపేక్షించేది లేదని దీనిపై జిల్లా కలెక్టర్ కూడా ఫిర్యాదు చేయవలసి ఉంటుందని అన్నారు. నీటి టాంకర్ల తీరుపై ఆర్డబ్ల్యూఎస్ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని వైకాపా సర్పంచులను ఇబ్బంది పెడుతున్నారని తమ దృష్టికి సర్పంచులు తీసుకువచ్చారని అన్నారు. వీటిని త్వరగా పరిష్కరించాలని ఎంపీడీవోకు ఎమ్మెల్యే ఆదేశించారు. విద్యుత్ శాఖ పై పలువురు సర్పంచులు అధికారిపై హర్షం వ్యక్తం చేశారు. శిశు సంక్షేమ శాఖలో అంగనవాడి వర్కర్స్ నిర్లక్ష్యం వహిస్తున్నారని తోకపల్లి సర్పంచి మల్లీశ్వరి ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాలలో కూలి పనికి వెళ్తున్న రైతుల పిల్లలను అంగన్వాడి స్కూలుకు తీసుకువెళ్లి తీసుకురావాలని కనీస బాధ్యతలు కూడా నెరవేర్చడం లేదని అన్నారు. గుబ్బారు గ్రామ సర్పంచి అంగరేకుల ఆదినారాయణ మాట్లాడుతూ గత మూడు నాలుగు రోజుల నుంచి గ్రామంలో నీటి సమస్యలు తీవ్రంగా ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదు అధికార పార్టీకి కొమ్ముకాస్తున్నారని అన్నారు. పంచాయతీకి రాకపోతే ఎన్ని ఇబ్బందులు పెట్టాలో అన్ని ఇబ్బందులు పెడతామని బెదిరింపులు చేస్తున్నారని ధ్వజమెత్తారు. తెదేపా సర్పంచులు ముగ్గురు ఉన్నప్పటికీ ఒకరు మాత్రమే హాజరయ్యారు. వ్యవసాయ అధికారి మాట్లాడుతూ ఈ వర్షాకాలంలో పంటలు వేసుకునేవారు వ్యవసాయ కార్యాలయంలో తగు విత్తనాలు అందుబాటులో సబ్సిడీతో ఇవ్వనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి చలమారెడ్డి, ఎంపీడీవో రాజ్ కుమార్ నాయక్, సర్పంచులు ఎంపీటీసీలు కో ఆప్షన్ నెంబర్లు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**భారీ బందోబస్తు మధ్య సర్వసభ్య సమావేశం**

పెద్దరవీడు మండలంలో మంగళవారం సర్వసభ్య సమావేశం భారీ బందోబస్తు మధ్య నిర్వహించారు. టిడిపి, వైసిపి నాయకులు శాంతిభద్రతలకు

(తరువాయి 4లో...)

# అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించాలి

ప్రభుత్వ లక్ష్యసాధనకు అనుగుణంగా

అధికారులు అలసత్వం వీడి బాధ్యతతో పనిచేయాలిలి

ట్రాన్స్ జెండర్లకు ప్రత్యేకంగా రేషన్ కార్డులు ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తాం

దివ్యాంగులకు ఉచితంగా బ్యాటరీ సైకిళ్ళు ఇచ్చేందుకు కృషి చేస్తాం

బోగస్ పింఛన్లకు అడ్డుకట్ట వేయాలి, అర్హులైన చివరి వ్యక్తి వరకు పింఛను అందించాలి

మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, ఆగస్టు 20)**



అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించాలని, ప్రభుత్వ లక్ష్యసాధనకను గుణంగా అధికారులు అలసత్వం వీడి బాధ్యతతో పనిచేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయ స్వామి అన్నారు. మంగళవారం నాడు వెలగపూడి సచివాలయంలో విభిన్న ప్రతిభావంతులు, వయో వయోవృద్ధులు,ట్రాన్స్ జెండర్స్ సంక్షేమంపై అధికారులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మంత్రికి వివరాలు తెలిపారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్ జెండర్స్ కి కల్పిస్తున్న సౌకర్యాలు, అందిస్తున్న సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం నిర్వహించాలి. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించాలి. అంద విద్యార్థులకు ఒకేషనల్, స్కిల్ కోర్సులు కూడా ప్రవేశపెట్టాలి. పాఠశాలలు ప్రారంభించే సమయానికే వారికి పాఠ్య పుస్తకాలు అందించాలి. ట్రాన్స్ జెండర్లు గుర్తింపు కార్డులు తీసుకునేలా అవగాహన కల్పించాలి. ట్రాన్స్ జెండర్లకి ప్రత్యేకంగా రేషన్ కార్డులు ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తాం. ట్రాన్స్ జెండర్ లతో స్వయం సహాయక బృందాల ఏర్పాటుకు ప్రోత్సహించాలి. వారికి స్వయం ఉపాధి కల్పించి సమాజంలో గౌరవంగా బతికేలా చర్యలు చేపట్టాలి. దివ్యాంగులకు బ్యాటరీ ట్రై సైకిల్లు ఇచ్చేందుకు ప్రణాళిక రూపొందించాలి. దివ్యాంగులకు సేవ చేసే అదృష్టం రావడం గొప్ప భాగ్యం. అధికారులు అలసత్వం వీడి బాధ్యతతో పని చేయాలి. అధికారులు సంబంధిత శాఖలపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ ఉండాలి. జిల్లా కలెక్టరేట్లలో జరిగే గ్రీవెన్స్ కి ఆయా శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలి. బోగస్ సర్టిఫికెట్లతో పింఛన్ల పంపిణీకి అడ్డుకట్ట వేయాలి. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా చెప్పిన హామీ ప్రకారం అధికారంలోకి వచ్చిన

(తరువాయి 4లో...)

# మానసిక, శారీరక ఆరోగ్యానికి క్రీడలు దోహదం

క్రికెట్ మ్యాచ్ విజేతలకు ఎస్పీ దామోదర్ అభినందన

క్రికెట్ మ్యాచ్ విజేతలుగా నిలిచిన సిబ్బందికి మెడల్స్, క్రికెట్ ట్రోఫీలు ఎస్పీ అందజేత

మానసిక, శారీరక ఆరోగ్యానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయి

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, ఆగస్టు 20)**



జిల్లా పోలీస్ కార్యాలయంలోని అన్ని విభాగాలలో పోలీస్ అధికారులు, సిబ్బందికి ఏఆర్ పోలీసు మైదానంలో నిర్వహి ంచిన పోలీస్ ఫ్రెండ్లీ క్రికెట్ టోర్నమెంట్‌లో గెలుపొందిన వారికి జిల్లా ఎస్పీ మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో మెడల్స్, క్రికెట్ ట్రోఫీలు అందచేసి ప్రత్యేకంగా అభినం దించారు. ఈ టోర్నమెంట్ లో ఎనిమిది టీములు రెండు గ్రూపుల్లో తలపడగా ఏ గ్రూప్‌లో స్వాట్ టీము జూనియర్, డిపిఓ, ఐటీ కోర్, పర్సనల్ సెక్యూరిటీ ఆఫీసర్స్, బి గ్రూప్‌లో స్పెషల్ పార్టీ జూనియర్, స్పెషల్ పార్టీ సీనియర్, స్వాట్ టీము సీనియర్, ఆఫీసర్స్ టీంలు హోరాహోరీగా తలపడ్డాయి. మంగళవారం ఫైనల్ మ్యాచ్ పర్సనల్ సెక్యూరిటీ ఆఫీసర్స్, పోలీస్ ఆఫీసర్స్ మధ్య రసవత్తరంగా జరిగింది. మ్యాచులో ఎవరికి వారు తక్కువ కాదని సత్తా చాటారు. స్నేహ పూర్వక క్రికెట్ మ్యాచ్‌లో చివరకు పోలీస్ ఆఫీసర్స్ జట్టు విజయం సాధించింది. మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు ఆర్ఎస్ఐ కె.మాలాద్రి అందుకున్నారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ నిత్యం శాంతిభద్రతల పరిరక్షణ, వివిధ రకాల కేసులు దర్యాప్తు, బందోబస్తు మొదలైన విధులతో సతమతమవుతున్న సిబ్బందిలో మానసిక ఉల్లాసాన్ని పెంపొందించేందుకు ఈ క్రికెట్ మ్యాచ్ లు నిర్వహించడం జరిగిందన్నారు. క్రికెట్ మ్యాచ్‌ల్లో పోలీస్ సిబ్బంది చూపిన ఉత్సాహం, పోరాట స్ఫూర్తిని అభినందించారు. విధుల నిర్వహణలో ఎదురవుతున్న సమస్యల పరిష్కారంలోనూ ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని

(తరువాయి 4లో...)

# వెలిగొండ ప్రాజెక్ట్ పై మాట్లాడే అర్హత జగన్‌కు లేదు

మంత్రి గొట్టిపాటి రవి కుమార్



**(షణ్ముఖ వెలుగు, అమరావతి, ఆగస్టు 20)**


వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు పునరావాసం గురించి మాట్లాడే కనీసం అర్హత కూడా వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి లేదని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ మండిపడ్డారు. వెలిగొండ ప్రాజెక్టును వెలుగొండ ప్రాజెక్టును అనార్థరైజ్డ్ ప్రాజెక్టు గా చూపించే ప్రయత్నం జగన్ మోహన్ రెడ్డి చేశారని అన్నారు. అయితే నాడు చంద్రబాబు నాయుడు, పార్టీ నేతలు అంతా ఢిల్లీ వెళ్లి కేంద్ర మంత్రులను కలిసి ఆథరైజ్డ్ ప్రాజెక్టుగా గెజిట్ నోటిఫికేషన్ ఇప్పించామని గుర్తు చేశారు. అధికారంలో ఉండి జగన్ రెడ్డి చేయాల్సిన పనిని తెలుగుదేశం పార్టీ ప్రతిపక్షంలో ఉండి చేసింది. దీనికి జగన్ మోహన్ రెడ్డి నిజంగా సిగ్గుపడాలని విమర్శించారు. జగన్ మోహన్ రెడ్డికి స్వప్రయోజనాలు తప్ప.. రాష్ట్ర ప్రయోజనాలను అవసరం లేదని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ఆరోపించారు. అప్పటి తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్‌తో కలిసి కుమ్మక్కై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రయోజనాలను జగన్ మోహన్ రెడ్డి తాకట్టుపెట్టారని విమర్శించారు.

**ఇసుక దోపిడీ మీద ఉన్న శ్రద్ధ ప్రాజెక్టుల నిర్వహణ మీద లేదు**

జగన్ మోహన్ రెడ్డికి ఇసుక దోపిడీ మీద ఉన్న శ్రద్ధ ప్రాజెక్టుల నిర్వహణ మీద లేదని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ అన్నారు. గుండ్లకమ్మ ప్రాజెక్ట్ గేటు కొట్టుకుపోతే అమర్చలేని అసమర్థుడు జగన్. అలాంటి వ్యక్తి చంద్రబాబు నాయుడు గురించి మాట్లాడుతారా? అని ప్రశ్నించారు. జగన్ మోహన్ రెడ్డి హయాంలోనే రాష్ట్రంలోని ప్రతీ ఒక్క సాగు నీటి ప్రాజెక్ట్ ను నిర్లక్ష్యానికి గురైందని పేర్కొన్నారు. సాగు నీటి ప్రాజెక్టులు ఆధునిక దేవాలయాలు

(తరువాయి 4లో...)

# వైభవంగా శ్రీ శ్రీనివాస కల్యాణం



**(షణ్ముఖ వెలుగు, రాజమహేంద్రవరం, ఆగస్టు 20)**

మన్యం ఫణి కుమార్, సునీత దంపతుల సౌజన్యంతో, తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో కలియుగ దైవం శ్రీనివాసుని కళ్యాణ వేడుక అంగరంగ వైభవంగా రాజమహేంద్రవరంలో సోమవారం సాయంత్రం జరిగింది. జేఎన్ రోడ్డు మన్యం గార్డెన్స్ లో జరిగిన కార్యక్రమంలో ప్రధాన వేదికపై శ్రీవారి ఉత్సవమూర్తులకు కమనీయంగా కల్యాణం జరిపించారు. వేదపండితులు వేణుగోపాల దీక్షితులు, సాయికృష్ణ శాస్త్రోక్తంగా జరిపించిన కల్యాణాన్ని భారీఎత్తున భక్తులు హాజరై తిలకించారు. మన్యం ఫణి కుమార్ దంపతులు మాజీ మంత్రి శిద్దా రాఘవరావు దంపతులు, శిద్దా సుధీర్ కుమార్ దంపతులు కళ్యాణ వేడుకలో పాల్గొన్నారు. ఈ వేడుకలకు రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్, ముక్కామల పీఠాధిపతులు శ్రీధర్ స్వామీజీ, మాజీ ఎమ్మెల్సీ అదిరెడ్డి అప్పారావు దంపతులు, తెదేపా నేత గన్ని కృష్ణ, ఉండవల్లి అరుణ్ కుమార్, భాజపా నేత సోము వీర్రాజు,

(తరువాయి 4లో...)

# అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించాలి



మొదటి నెల రూ.7000 పింఛన్ ఇచ్చాం. అర్హత ఉన్న చివరి వ్యక్తి వరకు పింఛన్లు అందించాలని మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి అన్నారు. ఈ సమావేశంలో మహిళా శిశు సంక్షేమం, వయోవృద్ధులు, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమం సెక్రటరీ ఎ. సూర్య కుమారి, డిప్యూటీ డైరెక్టర్ డి.రవి ప్రకాష్ రెడ్డి, దివ్యాంగ కార్పొరేషన్ ఎండి ఎం.ఎ కుమార్ రాజా, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# వెలిగొండ ప్రాజెక్ట్ పై మాట్లాడే అర్హత జగన్‌కు లేదు

అని అంటారు అలాంటి వాటని జగన్ రెడ్డి తన హయాంలో గాలికి వదిలేశాడని చెప్పారు. ఈ కారణం గానే ఏకంగా అన్నమయ్య ప్రాజెక్ట్ కొట్టుకుపోయిందని అన్నారు. రాష్ట్రాభివృద్ధికి పాటుపడాలని, రాష్ట్ర ప్రజలకు మంచి చేయాలి అనే ఆలోచనలు జగన్ మోహన్ రెడ్డికి ఎలాగూ రావు. ఇలాంటి సమయంలో కనీసం కొద్ది రోజుల పాటు ఏం మాట్లాడకుండా ఉంటే జగన్‌రెడ్డికి చాలా మంచిది అని హితవు పలికారు.

# మహిళల చట్టాలు పటిష్ట పరచాలి



(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం ఇన్‌ఛార్జి, ఆగస్టు 20)

యర్రగొండపాలెంలోని ప్రెస్ క్లబ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోల్‌కత్తాలో జరిగిన ట్రైనీ డాక్టర్ మౌమితపై మానవ మృగాలు ఆమెపై అత్యాచారం చేసి హత్య చేసిన దుర్మార్గులను కఠినంగా శిక్షించాలని, అటువంటి వారికి వెంటనే తగిన శిక్ష విధించాలని, దేశంలో మహిళల కోసం అనేక చట్టాలు చేసినా కానీ ఏ ఒక్క చట్టం మహిళలకు పూర్తి రక్షణ కల్పించే విధంగా వాటిని అమలుపరచకపోవడం దోషులకు వెంటనే శిక్ష విధించకపోవడం ఇటువంటి సంఘటన జరగడానికి మరల అవకాశం ఇచ్చే విధంగా ఉన్నాయని ప్రజలు వాపోతున్నారు. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రాలు మహిళల చట్టాలను కఠినంగా సపరేట్ కమిషన్ ద్వారా విచారించి దోషులకు కఠినంగా శిక్ష పడేలా వెంటనే అమలు పరచాలని ప్రెస్ క్లబ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిరసన తెలిపారు. యర్రగొండపాలెం డిప్యూటీ తహసీల్దార్ ఉప్పలపాటి విజయభాస్కర్‌కు అర్జీ ఇవ్వడం జరిగింది. ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కాకర్ల కోటయ్య ఉపాధ్యక్షులు షేక్ షరీఫ్ కృపాదానం, గౌరవ సలహాదారులు సర్దార్, ప్రకాష్, వెంకట్ నాయుడు, కార్యదర్శి షేక్ రియాజ్, సహాయ కార్యదర్శి శేఖర్, బొర్రారెడ్డి, కోశాధికారి పొట్టి రవికుమార్, సభ్యులు నాసరయ్య, షమీవుల్లా, ప్రెస్ క్లబ్ మీడియా ఇన్‌చార్జి ఉప్పలపాటి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# పెద్దారవీడు నూతన ఎస్ఐ గా అనిల్ కుమార్




(షణ్ముఖ వెలుగు, పెద్దారవీడు, ఆగస్టు 20)

ఆదివారం జరిగిన ఎస్సైల బదిలీలో భాగంగా పెద్దారవీడు స్టేషన్ కు నూతన ఎస్సైనీ నియమించారు. ఇప్పటి వరకు పెద్దారవీడు మండల ఎస్ఐగా పని చేసిన వెంకట సైదులను ఒంగోలు విఆర్‌కు బదిలీ చేశారు. ఆయన స్థానంలో నూతన ఎస్ఐగా మంగళవారం పవన్ కుమార్ బాధ్యతలు చేపట్టారు.

# వైభవంగా శ్రీ శ్రీనివాస కల్యాణం







ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, తది తర రాజకీయ ప్రముఖులు,పారిశ్రామిక వేత్తలు అనుపమ శ్రీనివాస్,శిద్దా పాండురంగారావు దంపతులు శిద్దా హనుమంతరావు దంపతులు,శిద్దా సూర్య ప్రకాశరావు దంపతులు, ఎం.శివరామ్, మన్యం కుటుంబ సభ్యులు,శిద్దా కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున



హాజరయ్యారు. నందూరి శ్రీనివాస్ ఆధ్యాత్మిక ప్రవచనాలు, చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శన,అన్నమాచార్య ప్రాజెక్టు సంగీత విభావరి భక్తులను అలరించాయి. కళ్యాణ వేడుకలకు హాజరైన భక్తులకు మన్యం ఫణి కుమార్ దంపతులు స్వామి వారి లడ్డూ ప్రసాదాలు అందచేశారు.

# రాజకీయ పార్టీలకు అతీతంగా పనిచేయాలి

భంగం కలగజేస్తారని మార్కాపురం సిఐ ఆవుల వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో ఇద్దరు ఎస్ఐలు, 20 మంది పోలీస్ బందోబస్తు నిర్వహించారు. రాష్ట్రంలో జరుగుతున్నటువంటి పరిణామాలు దృష్టిలో ఉంచుకొని సీఐ ఆవులు వెంకటేశ్వర్లు తగు జాగ్రత్తలు తీసుకొని ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూశారు.





# మానసిక, శారీరక ఆరోగ్యానికి క్రీడలు దోహదం



సూచించారు.మానసిక, శారీరక ఆరోగ్యానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని, కావున ప్రతి ఒక్కరు ఏదో ఒక్క క్రీడను ఎంచుకొని ఆడటం వలన మానసిక ఒత్తిడిని అధికమించి, ఆరోగ్యంగా ఉంటారని తెలియ చేశారు. పోలీస్ సిబ్బంది మంచి ఆరోగ్యంతో ఉండాలని, మంచి ఆహారపు అలవాట్లు అలవరచుకోవాలని, క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని, ఒత్తిడిని అధిగమించడానికి యోగా, మెడిటేషన్ వంటివి చేయాలని సూచించారు. భవిష్యత్‌లో కూడా జిల్లాలోని అన్ని సబ్ డివిజన్ సిబ్బందితో క్రీడలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వర రావు, ఎఆర్ ఎఎస్పీ అశోక్ బాబు, ఐటి కోర్ సీఐ సూర్యనారాయణ, ఆర్ఐ రమేష్ కృష్ణన్, ఆర్ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.





# దాతల సహకారంతో స్వర్గధామం, ముఖ ద్వారం, స్టీల్ గేటుకు ఆర్థిక సహాయం అందజేత

(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, ఆగస్టు 20)

స్వర్గధామం (హిందూ స్మశాన వాటిక) అభివృద్ధి పనులలో భాగంగా ఇస్కాన్ సభ్యులు సుబ్బారెడ్డి (చిన్న పిల్లల వైద్య నిపుణులు ), గుత్తి శ్రీధర్ ల ఆర్థిక సహకారంతో స్వర్గధామం ముఖ ద్వారం, స్టీల్ గేటు బిగించారు. త్వరలో అన్ని వసతులతో స్వర్గధామం నిర్మాణం పూర్తిస్థాయిలో జరుగుతుంది. కావున పట్టణ ప్రజలు ఆర్థిక సహాయాన్ని అందించి, నిర్మాణం పనులు పూర్తి చేయుటకు సహకరిస్తారని కనిగిరి స్వర్గధామం కమిటీ వారు విజ్ఞప్తి చేశారు.



# ఎస్ కొత్తపల్లి మాజీ సర్పంచ్

**తిరుమలరెడ్డి యోగిరెడ్డి మృతికి పలువురి నివాళి**



(షణ్ముఖ వెలుగు, పెద్దారవీడు, ఆగస్టు 20)

మండల తెలుగుదేశంపార్టీ సీనియర్ నాయకులు ఎస్.కొత్తపల్లి మాజీ సర్పంచ్ తిరుమలరెడ్డి యోగి రెడ్డి భౌతికయానికి పలువురు నివాళు లర్పించారు. వారిలో పెద్దారవీడు మండల మాజీ జడ్పిటిసి కందుల రామిరెడ్డి, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మెట్టు శ్రీనివాసరెడ్డి, మాజీ అధ్యక్షులు గొట్టం శ్రీనివాసరెడ్డి, చంద్రగుంట్ల నాగేశ్వరరావు , మాజీ జెడ్పిటిసి జడ్డా రవి, ఎంపీటీసీ దండా వెంకటేశ్వర రెడ్డి, జిఎంఆర్ హై స్కూల్ కరస్పాండెంట్ జి మల్లికార్జున రెడ్డి, సర్పంచులు ఇండ్ల రామకృష్ణారెడ్డి, ఆకుమల్ల శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ వెన్న వెంకటరెడ్డి,నాయకులు తిరుమలరెడ్డి చిన్న వెంకటరెడ్డి, గొట్టం రమణారెడ్డి,వెన్న సుబ్బారెడ్డి, ఎంఎస్, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు నివాళులర్పించారు.

# దర్శి డీఎస్పీని కలిసిన పొదిలి ఎంఆర్‌పీఎస్ నాయకులు, దళిత సంఘాల నాయకులు



(షణ్ముఖ వెలుగు, దర్శి, ఆగస్టు 20)

స్థానిక దర్శి డీఎస్పీ ఆఫీసులో నూతన డిఎస్పి లక్ష్మీనారాయణను కలిసి పౌర సన్మానం చేశారు. పొదిలి మండలం ఎమ్మార్పీఎస్ నాయకులు. అనంతరం ప్రత్యేక దళితుల సమస్యలపై చర్చించడం జరిగింది. ఈ సందర్భంగా లిపొదిలి మండల ఎంఆర్‌పీఎస్ అధ్యక్షులు వేల్పుల సురేష్ మాదిగ మాట్లాడుతూ పొదిలి మండలంలో దళితులకు న్యాయమైన సమస్యలను చట్ట పరిధిలో తమ దృష్టికి వచ్చిన ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ కేసులను తక్షణమే విచారణ జరిపించి బాధితుడు న్యాయం చేయాలని ఆయన ఈ సందర్భంగా డిఎస్పీ లక్ష్మీనారాయణ కోరారు ఆయన స్పందిస్తూ న్యాయమైన సమస్యలను తక్షణమే పరిష్కరిస్తారని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పొదిలి మండల ఎంఆర్పిఎస్ సీనియర్ నాయకులు వేల్పుల నెహమియా బాబు మాదిగ, రాష్ట్ర దళిత సేన దర్శి నియోజకవర్గ అధ్యక్షుడు జి ప్రేమ్ కుమార్, వేల్పు ఎలిషా మాదిగ, జి.అహెూరోన్ మాదిగ, జి.జాన్ మాదిగ, అంతోని మాదిగ పాల్గొన్నారు.

# వరదయ్యపాలెం ఎస్ఐ గా కేబి మల్లికార్జున్



(షణ్ముఖ వెలుగు, వరదయ్యపాలెం, ఆగస్టు 20)

వరదయ్యపాలెం నూతన ఎస్ఐగా కేబీ మల్లికార్జున్ నాయుడు నియమితులయ్యారు. గతంలో ఇక్కడ పని చేస్తున్న ఎస్సై ప్రతాప్ అనివార్య కారణాలతో హఠాత్తుగా విఆర్‌కి బదిలీ అయిన విషయం తెలిసిందే. కడప తాలూకా పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా పనిచేస్తున్న కేబి మల్లికార్జున్‌ను వరదయ్యపాలెం ఎస్ఐగా నియమిస్తున్నట్టు అనంతపురం రేంజ్ డిఐజి షిముషి బాజ్ పెయ్ ఉత్తర్వులు జారీ చేశారు. అదేవిధంగా బిన్ కండ్రిగ ఎస్ఐగా ఉన్న ఇవి వెంకట నరసింహంను ఎస్పీ తిరుపతి వీఆర్‌కు బదిలీ చేయగా, ఎస్పీ తిరుపతి వీఆర్లో ఉన్న విశ్వనాథ నాయుడును బిన్ కండ్రిగ ఎస్ఐగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

# దోమలు, వాటి ద్వారా వచ్చే వ్యాధుల పై అవగాహనా సదస్సు







(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్ట్ 20)

ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా వి.యాన్.ఆర్ పాఠశాలలో జిల్లా మలేరియా అధికారి ఆధ్వర్యంలో జాతీయ కీటక జనిత వ్యాధి నియంతరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రంలో జిల్లా మలేరియా అధికారి మాట్లాడుతూ ఈ సంవత్సరం వైద్య, ఆరోగ్య,కుటుంబ సంక్షేమ శాఖ ఆంధ్రప్రదేశ్, వారి నినాదం దోమరహిత సమాజం ఆరోగ్యానికి సోపానంఅను నినాదంతో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అనాఫిల్స్ అడ దోమ ద్వారా మలేరియా వ్యాప్తి చెందుతుందని, సార్ రోనాల్డ్ రాస్ గుర్తించిన ఈ రోజును ప్రపంచ మలేరియా దినోత్సవంగా పాటించడం జరిగిందని తెలిపారు. విద్యార్థులకు దోమల వలన సంక్రమించు వ్యాధులు, వాటి నివారణ పై అవగాహన కల్పించారు. జిల్లా మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ దోమల వలన సంక్రమించు వ్యాధులను ఫ్రైడే డ్రైడే తప్పక పాటించడం ద్వారా ప్రాథమిక స్థాయిలోనే మలేరియా, డెంగ్యూ , చికిన్ గున్యా, ఇతర దోమల వలన సంక్రమించే వ్యాధులను నివారించవచ్చునని తెలిపారు. ప్రతిఒక్కరు బాధ్యతాయుతంగా దోమల నివారణలో ఇతర ప్రభుత్వ సంస్థలకు సహకరించి దోమల వ్యాప్తి అరికట్టాలని తెలిపారు. ఎవరికి అయినను జ్వరము చలి ఉన్నట్లు అయితే సమీపములోని పట్టణ లేదా ప్రాథమిక ఆరోగ్యకేంద్రము సమీపించి తగు సత్వర వైద్యం అందుకొనవలసినదిగా తెలిపారు. . ముఖ్యముగా దోమల అవస ప్రాంతమైన నీరు నిల్వ ఉన్నపాత టైర్స్ , పూలకుండీలు , కొబ్బరి బండలు, పుల్ల తొట్లు , వాడి వొదిలేసిన నీళ్ల సీసాలు , మొదలగు వాటిని గుర్తించి వెంటనే వాటిని తొలగించాలని కోరారు. దోమతెరలు వాడటం వలన దోమకాటును నివారించవచ్చన్నారు. కార్యక్రములో ఉప మాస్ మీడియా అధికారి సరోజినీ, సబ్ యూనిట్ అధికారులు సాగర్, శ్రీనివాసులు ,వెంకారెడ్డి వి.యాన్.ఆర్ స్కూల్ హెడ్ మాస్టర్ కె.మాధవరావు, స్కూల్ సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## కంభంలో డిగ్రీ విద్యార్థులు నిరసన



(షణ్ముఖ వెలుగు, కంభం, ఆగస్టు 20)

కలకత్తాలోని జూనియర్ డాక్టర్‌పై జరిగిన అమానుష సంఘటనపై కంభంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని డిగ్రీ విద్యార్థులు ఈ సంఘటనపై నిరసన తెలిపారు. కంభం జూనియర్ కళాశాల నుంచి ర్యాలీగా బయలుదేరి కంభం ఆర్టీసి బస్టాండ్ నుంచి అటుగా కందులాపురం కూడలిలోని సినిమా హాలు సెంటర్ దగ్గరికి ర్యాలీగా వచ్చి అక్కడి నుండి కంభం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెల్లారు. అలాగే ప్రభుత్వ జూనియర్ డిగ్రీ కళాశాల ఉపాధ్యాయుడు రంజిత్ కుమార్ మాట్లాడుతూ దేశంలోని ఇటువంటి సంఘటనలు ఆడవారిపై చిన్నపిల్లలపై ఇలాంటి అఘాయిత్యాలు నిత్యం జరుగున్నా ప్రభుత్వాలు వీటిని ఆపడంలో విఫలమయ్యారని అన్నారు. అలాగే ఆడవారిపై, చిన్నపిల్లలపై జరువుగున్న అఘాయిత్యాలపై ప్రభుత్వాలు కొత్త చట్టాలను తీసుకొని వచ్చి వీటిని అంతమందించే దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ర్యాలీలో కంభం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు.

## యువతను మత్తు నుంచి కాపాడండి

### ఏఐవైఎఫ్ నాయకులు




(షణ్ముఖ వెలుగు, వరదయ్యపాలెం, ఆగస్టు 20)

సత్యవేడు సర్కిల్ పరిధిలో వరదయ్యపాలెం మండలంకు చెందిన ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ యువజన నాయకులు సి మురళి,టి నాగార్జున సత్యవేడు సర్కిల్ ఇన్స్పెక్టర్ మురళికి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. వారు మాట్లాడుతూ స్థానిక మండల,పట్టణ,గ్రామీణ ప్రాంతాలలో గంజాయి విచ్చలవిడిగా అమ్మకాలు జరుగుతున్నాయని, స్థానిక శ్రీసిటీ పరిధిలో ఉన్న ఇతర రాష్ట్రాల నుంచి వస్తున్న వారి ద్వారా బయటి రాష్ట్రాలు ద్వారా గంజాయి సత్య వేడు కొన్ని మండలాల్లో విచ్చలవిడిగా అమ్మకాలు జరుగుతున్నాయని, దీనికి యువత బానిసగా వ్యసనాలకు అలవాటు పడుతున్నారని, దీనిపై పోలీస్ వ్యవస్థ సమగ్ర నివారణ దిశగా ఉన్వ్యవహరించాలని మత్తు పదార్థాల నుంచి యువతీ,యువకులను రక్షించాలని వారు సర్కిల్ ఇన్స్పెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు.

## నేతపాలెంలో మెడికల్ క్యాంపు








(షణ్ముఖ వెలుగు, పొదిలి, ఆగస్టు 20)

పొదిలి నగర పంచాయతీలోని నేతపాలెంలో తీవ్ర జ్వరాలతో ప్రజలు ఇబ్బంది పడుతుండడంతో స్పందించిన వైద్య సిబ్బంది డాక్టర్ శరత్ చంద్ర ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు.ఈ రోగులను పరీక్షించిన డాక్టర్ శరత్ చంద్ర మీడియాతో మాట్లాడుతూ వర్షాకాలం కావడం వలన సీజనల్ జ్వరాలు నేతపాలెంలో ఎక్కువగా వస్తున్న విషయం గ్రహించి ఈ ప్రాంతంలో మెడికల్ క్యాంపు అవసరమని భావించి ఇక్కడ ఈ శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రోగులకు అవసమైన పరీక్షలు నిర్వహించి వెంటనే మందులు కూడా ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏంఎల్‌హెచ్ పి సుప్రజ, ఎల్‌టిపరశురామ్, ఏఎన్ఏంలు విజయ, రాణి, ఆశా వర్కర్లు ఇతర వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి పెట్టండి

**భూసేకరణ, నీటి వసతి, విద్యుత్ సదుపాయలు కల్పించాలి**

**వేగంగా అనుమతులు ఇవ్వాలి**

**పక్కాగా క్లస్టర్ డెవలప్‌మెంటు ప్రోగ్రాం అమలు**

**లబ్ధిదారులకు పిఎంఈజిపి, పిఎం సూర్యఘర్ యోజన పథకాలు అందించేలా చర్యలు..**

**జిల్లా కలెక్టర్ ఆనంద్**



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఆగస్టు 20)

జిల్లాలో వేగంగా పరిశ్రమలు స్థాపించేందుకు అన్నిశాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, జిల్లా పారిశ్రామికాభివృద్ధికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఆనంద్ పేర్కొన్నారు. మంగళవారం ఉదయం కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ హాలులో జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. తొలుత గత సమావేశంలో చర్చించిన అంశాలపై తీసుకున్న చర్యలను పరిశ్రమల శాఖ జిఎం సుధాకర్ కమిటీ సభ్యులకు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఏర్పాటవుతున్న భారీ పరిశ్రమలకు అన్ని అనుమతులు, భూసేకరణ, నీటివసతి, విద్యుత్ మొదల్కైన సదుపాయాలు వేగంగా కల్పించేందుకు అన్నిశాఖల అధికారులు కృషిచేయాలన్నారు. పరిశ్రమల ఏర్పాటుతోనే జిల్లాలో పారిశ్రామికాభివృద్ధి సాధ్యమని, ఉపాధి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని, ఈ దిశగా కమిటీ సభ్యులు పనిచేయాలని సూచించారు. పరిశ్రమల ఏర్పాటులో వున్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరించి జిల్లాలో పరిశ్రమల ఏర్పాటు పనులు త్వరగా మొదలయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. నిర్దిష్ట గడువులోగా సమస్యలను పరిష్కరించాలన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు వస్తున్న దరఖాస్తులను నిబంధనల మేరకు ఆమోదించాలన్నారు. దరఖాస్తులను ఎందుకు తిరస్కరిస్తున్నారో ఆయా పరిశ్రమల నిర్వాహకులకు తెలిపి, రెక్టిఫికేషన్ చేయించి మళ్లీ ఆయా పరిశ్రమల నిర్వాహకుల చేత దరఖాస్తులు పెట్టించాలని అధికారులకు సూచించారు. క్లస్టర్ డెవలప్‌మెంటు ప్రోగ్రాం ద్వారా అర్బన్, రూరల్ ప్రాంతాల్లో ఎన్ని యూనిట్లు పనిచేస్తున్నాయి? అవి ఇళ్లల్లో ఉన్నాయా? దుకాణాల్లో వున్నాయా, ఎంతమంది పనిచేస్తున్నారు వంటి వివరాలు సేకరిస్తూ సర్వే చేపట్టాలన్నారు. లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించి, ఆయా పథకాలను అందించి వారు మరింత ఆర్థికంగా వ్యాపారాన్ని వృద్ధి చేసుకునేందుకు సహకరించాలన్నారు. ఇళ్లల్లో యూనిట్లు నిర్వహిస్తున్న లబ్ధిదారులకు 300 యూనిట్ల వరకు ఎపిఎస్‌పిడిసిఎల్ ద్వారా ఉచిత విద్యుత్ అందించే ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకం, యూనిట్ల విస్తరణ, మరొక యూనిట్ స్థాపనకు పిఎంఈజిపి పథకాన్ని బ్యాంకర్లతో మాట్లాడి అందించాలని సూచించారు. అర్హులైన లబ్ధిదారులందరికి పిఎంఈజిపి పథకం వర్తించేలా లబ్ధిదారుల సర్వే చేసి ఎంతమేర రుణం అవసరమో తెలుసుకుని దరఖాస్తు చేయించాలన్నారు. రెడిమెడ్స్, గోల్డ్, ఆఫ్‌సెట్, వెబ్‌ప్రింటింగ్, నోట్‌బుక్ తయారీ క్లస్టర్ లబ్ధిదారులను ఎంపిక చేసి ఖాదీ విలేజ్ ఇండస్ట్రీయల్ బోర్డు, జిల్లా పరిశ్రమల కేంద్రం ద్వారా రుణాల మంజూరుకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో జిఎం సుధాకర్, ఎపిఐఐసి జడ్ఎం విజయరత్నం, డిపివో సుస్మిత, విద్యుత్‌శాఖ ఎస్ఈ విజయన్, సోమశిల, కండలేరు ప్రాజెక్టుల ఎస్ఈలు ఎం.వి.రమణారెడ్డి, బి.వి.రమణారెడ్డి, పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు ఈఈ రాజశేఖర్, ఉపకార్మికశాఖ అధికారి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## 23 నుంచి ఉపాధి హామీ గ్రామసభలు

(షణ్ముఖ వెలుగు, పెద్దారవీడు, ఆగస్టు 20)



జాతీయ గ్రామీణ ఉపాధి హామి పథకం కింద గ్రామాల్లో నూతన పనులను గుర్తించి తీర్మానాలు చేయాలని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశించినట్టు ఎంపీడీవో రాజ్ కుమార్ తెలిపారు. మంగళవారం ఉపాధి హామీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీడీవో గారు పాల్గొని ఆయన మాట్లాడుతూ ఈ నెల 23న అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించాలని సూచించినట్లు రాజ్ కుమార్ తెలిపారు. ఉపాధి పథకంలో చేపట్టాల్సిన పనుల ఆమోదం కోసం గ్రామసభలు నిర్వహించి పంచాయతీల ద్వారా తీర్మానాలు అమోదింప చేసుకోవాలని ఉపముఖ్యమంత్రి సూచించినట్టు ఎంపీడీవో రాజ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ మంత్రు నాయక్, క్షేత్ర సహాయకులు సాంకేతిక నాయకులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ల, పాల్గొన్నారు.

## పని సర్దుబాటు కౌన్సిలింగ్ బాయ్‌కాట్

### యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు షేక్ అబ్దుల్ హై

(వెలుగు న్యూస్, పొదిలి, ఆగస్టు 20)

ఫ్యాప్టో రాష్ట్ర సంఘం పిలుపుమేరకు రాష్ట్రవ్యాప్తంగా వివిధ మండలాల్లో జరిగే పని సర్దుబాటు కౌన్సిలింగ్ విధానాన్ని బాయ్ కాట్ చేస్తున్నట్లు యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు షేక్ అబ్దుల్ హై జీవో నెంబర్ 117వెంటనే రద్దుచేసి జీవో నెంబర్ 53 ద్వారా పని సర్దుబాటు చేయాలని ఎస్జిటి ఉపాధ్యాయులు స్థానిక మండల కార్యాలయంలోని మ్యానువల్‌గా కౌన్సిలింగ్ నిర్వహించాలన్నారు. ఇంట్రా మేనేజ్మెంట్ కౌన్సిలింగ్ విధానాన్ని ఆపాలని ఉపాధ్యాయుల గ్రీవెన్స్‌ను ముందు పరిష్కరించిన తర్వాత మాన్యువల్ కౌన్సిలింగ్ నిర్వహించాలని, ఆగస్టు 16వ తేదీ నాటి రోల్‌ని క్రైటీరియా తీసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలను కాపాడాలని, పేద బడుగు,బలహీన వర్గాల పిల్లలకు విద్యను దూరం చేయకుండా పాఠశాలలో ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. కార్యక్రమంలో కొనకనమిట్ల మండల విద్యాశాఖ అధికారి 1,2 ఎస్.కె డాంగే షరీఫ్, బరిగే నరసింహారావు లకు మెమోరండం ఇచ్చారు. కొనకనమిట్ల మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కే నాసర్ మహమ్మద్ ,కామేశ్వరరావు పోలు శ్రీనివాస్ రెడ్డి, బి.కృపారావు, వేల్పుల రమేష్, జి సుజాత, పూసపాటి వెంకటేశ్వర్లు, వాకా శ్రీనివాస్ రెడ్డి ,జి భారతీదేవి, బి భాగ్యలక్ష్మి రంజాన్బి, వి.రమాదేవి, ఎన్.సాయి లక్ష్మి, గట్ల విజయలక్ష్మి, కే.నరసింహారావు, ఓబులేసు నారాయణ, అశోకు రమేషు, డి.సంధ్యారాణి, మరిపూడి వెంకటరమణ, వీరేంద్ర బాబు తదితరులు పాల్గొన్నారు

## గిద్దలూరు అర్బన్ సీఐ సురేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన టీడీపీ నేతలు



(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, ఆగస్టు 20)

గిద్దలూరు పట్టణ నూతన సీఐగా బాధ్యతలు చేపట్టిన టీ.సురేష్‌ను పట్టణానికి చెందిన టీడీపీ నాయకులు మర్యాదపూర్వకంగా పూలమాల శాలువా వేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీఐతో పట్టణంలోని పలు అంశాలపై చర్చించారు. అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు చర్యలు తీసుకోవాలని కోరారు. సిఐ సురేష్ ను కలిసిన వారిలో కౌన్సిలర్ లు లొక్కు రమేష్, చంద్రశేఖర్,మాజీ కౌన్సిలర్ మండ్ల శ్రీనివాసులు, బోయిలపల్లి కిషోర్, జిల్లెల్ల సంపత్ కుమార్ రెడ్డి, నియోజకవర్గ టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు బొర్రా రాఘవేంద్ర యాదవ్, తెలుగు యువత సభ్యులు బూనబోయిన రాజశేఖర్, కసినబోయిన శేఖర్, నన్నెబోయిన పెద్దిరాజు, తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన శ్రీగిరి పవిత్రోత్సవాలు





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 20)

ఒంగోలులోని కుర్తాళం శ్రీ సిద్ధేశ్వరీ పీఠపాలిత శ్రీగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి మూడు రోజుల పవిత్రో త్సవాలు మంగళ వారం పూర్ణాహుతితో శాస్త్రోక్తంగా ముగిసాయి. టిటిడి ఆగమ పండితులు పరాంకుశం సీతారామాచార్యులు బృందంతో పాటు శ్రీగిరి ఆలయ అర్చకులు వేద పండితుల ఆధ్వర్యంలో వైఖానస ఆగమానుసారం పవిత్రోత్సవాలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పవిత్రోత్సవాలలో భాగంగా మంగళవారం శ్రీవారికి సహస్ర నామార్చన, విష్వక్సేన ఆరాధన, కుంభారాధన, సుదర్శనారాధన, సర్వ దైవత్వ హోమం, సహస్రశీతి మంత్ర హోమం, విశేష స్నపన తిరుమంజనం , కుంభ నివేదనం, సర్వ దైవత్వ హోమం, ప్రాయశ్చిత్త హోమం, ఉక్త హోమం , పూర్ణాహుతి , రక్షాబంధన విసర్జన ,ఆచార్య శేష వస్త్ర బహుమానం, బ్రహ్మ ఘోష, యజమాన ఆశీర్వచనం కార్యక్రమాలతో మూడు రోజుల పవిత్రోత్సవాలు ముగిసాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి , కార్య నిర్వహణ ధర్మకర్త సి వి రామకృష్ణారావు,ధర్మకర్తలు ఆలూరు వెంకటేశ్వరరావు, ఆలూరు లక్ష్మీ కుమారి, శ్రీగిరి దేవస్థానం ఉత్తర అమెరికా ప్రతినిధి డాక్టర్ ఆలూరు శ్రీనివాస చరణ రాజీవ్, ఆలూరు జై శంకర్ తదితరులు పర్యవేక్షించారు. పవిత్రోత్సవాలను విజయవంతంగా నిర్వహించడంలో చక్కటి తోడ్పాటును అందించిన ప్రతి ఒక్కరికీ శ్రీ గిరి దేవస్థానం నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

# రాజకీయ ఫ్లెక్సీలు వద్దు

**కార్పొరేషన్ అనుమతి ఉన్న హోర్డింగ్ బోర్డులకే కట్టండి**

**నేను తొలిసారి ఎమ్మెల్యే అయిన వెంటనే చెప్పా రాజకీయ ఫ్లెక్సీలు వద్దు**

**నరసింహకొండ దేవస్థానం వద్ద నాకు కట్టిన ఫ్లెక్సీలను స్వయంగా నేనే చించివేశా**





(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఆగస్టు 20)

నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 17వ డివిజన్, హరనాథపురం సెంటర్‌లో సూర్య నమస్కారాల విగ్రహాల ఏర్పాటు పనులకు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి , టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డిలు శంకుస్థాపన చేశారు. ఆర్ , బి గెస్ట్ హౌస్‌లో జిల్లా అధికారులందరి ముందు మంత్రి నారాయణకు రాజకీయ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయవద్దని చెప్పి, మంత్రి నారాయణని కఠిన నిర్ణయం తీసుకోమని చెప్పామన్నారు. నా కార్యక్రమంలో రాజకీయ ఫ్లెక్సీలు లేకుండా చేద్దామని నేనే శ్రీకారం చుట్టా. నెల్లూరు జిల్లాలో ఉండే అన్ని రాజకీయ పార్టీలకు విజ్ఞప్తి చేస్తున్నా అందరూ సహకరించండన్నారు. నా కార్యక్రమాలలో ఫ్లెక్సీలు, బొకేలు, శాలువాలు చేసేబదులు అన్న కాంటీన్‌లకు విరాళం ఇవ్వండన్నారు. పదిమందికి భోజనం పెట్టినవాళ్ళు అవుతారన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# మాగుంటకు కృతజ్ఞతలు తెలిపిన ఏకేయూ వైస్ ఛాన్సలర్



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 20)

నిధులు మంజూరు కాకపోవడంతో గత సంవత్సరం కాలం నుంచి ఆర్థిక పరమైన ఇబ్బందులను ఎదుర్కొంటున్న ఆంధ్ర కేసరి యూనివర్శిటీకి నిధులు మంజూరు చేయాలని ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి మంగళవారం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను కలిసి విజ్ఞాపన పత్రాన్ని అందజేసిన సందర్భాన్ని పురస్కరించుకుని ఆంధ్ర కేసరి యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డి.వి.ఆర్.మూర్తి ఆయనకు హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం ఆంధ్ర కేసరి యూనివర్శిటీలో దూర ప్రాంత విద్యార్థుల సౌకర్యార్థం వసతి గృహాలు అందుబాటులో లేవని, ప్రస్తుత కాలంలో డిమాండ్ తోబాటు ఆవశ్యకత ఉన్న కోర్సులను నూతనంగా ఏర్పాటు చేసుకునేందుకు అవసరమైన నిధుల కేటాయింపు, యూనివర్శిటీ నిర్వహణ కోసం అవసరమైన బోధన, బోధనేతర సిబ్బందిని నియమించాలని ఇటీవలే ప్రొఫెసర్ మూర్తి ఒంగోలు ఎం.పి.మాగుంట శ్రీనివాసులురెడ్డి దృష్టికి తీసుకొని వెళ్లిన విషయం తెలిసిందే. దీంతో ఆయన మంగళ వారం ఉండవల్లి లోని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నివాసంలో విద్యా శాఖా మంత్రి నారా లోకేష్‌ని మర్యాద పూర్వకంగా కలసి జిల్లా అభివృద్ధి పనుల గురించి చర్చించడం తోబాటు ఒంగోలు నగరంలో నూతనంగా ఏర్పాటు చేయబడిన ఆంధ్రకేసరి యూనివర్సిటీ అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి చేయ వలసినదిగా కోరారు.

# బ్యారేజీల పేర్ల మార్పు సరికాదు

## మాజీమంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఆగస్టు 20)

నెల్లూరు జిల్లాలోని, సంగం బ్యారేజీకి మేకపాటి గౌతమ్ రెడ్డి బ్యారేజీ, నెల్లూరు బ్యారేజీకి నల్లపురెడ్డి శ్రీనివాసులు రెడ్డి బ్యారేజీ అని గత ప్రభుత్వంలో నామకరణం చేసిన విధంగానే కొనసాగించాలని తెలుగుదేశం ప్రభుత్వం, గత ప్రభుత్వంలో బ్యారేజీలకు పెట్టిన పేర్లను తొలగించడం సరికాదని, బ్యారేజీలకు తిరిగి పాత పేర్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేసిన మాజీ మంత్రి కాకాణి అన్నారు. నెల్లూరు నగరంలో డైకస్ రోడ్డులోని క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి డాక్టర్ కాకాణి గోవర్ధన్ రెడ్డి మాట్లాడారు సోమశిల జలాశయానికి తానే ఆద్యుడిగా చంద్రబాబు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. 1995 నుంచి 2004 వరకూ అయన ముఖ్యమంత్రిగా ఉన్నారు ఏనాడైనా సమగ్ర సోమశిల గురించి ఆలోచించారా..?అని ప్రశ్నించారు అప్పట్లో 36 టి.ఎం.సి.ల నీటి నిల్వ సామర్థ్యం ఉండేది.. వై.యస్.రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాతే సోమశిల సామర్థ్యాన్ని 78 టీఎంసీలకు పెంచారన్నారు. అదేవిధంగా పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యాన్ని కూడా 44 వేల క్యూసెక్కులకు అదనంగా పెంచారు. అప్పట్లో తెలంగాణలోని కాంగ్రెస్ వాదులు దీనిని వ్యతిరేకించినా, వై.యస్. రాజశేఖర్ రెడ్డి ఖాతరు చేయలేదన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా 14 ఏళ్లల్లో ఎప్పుడూ పెన్నార్ డెల్టా ఆధునీకరణ గురించి పట్టించుకోలేదు. నెల్లూరు జిల్లాకు చెందిన సంగం...నెల్లూరు బ్యారేజ్‌ల నిర్మాణాన్ని చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పట్టించుకోలేదు.. మేమే పూర్తి చేశామన్నారు. సంగం బ్యారేజ్ కు మంత్రిగా ఉంటూ మరణించిన స్వర్గీయ మేకపాటి గౌతమ్ రెడ్డి పేరును పెడితే, దానిని చంద్రబాబు తొలగించడం దురదృష్టకరమన్నారు. నెల్లూరు జిల్లా సాగునీటి రంగంలో విశేష సేవలు అందించిన మాజీ మంత్రి పేరిట నెల్లూరు బ్యారేజ్ కు పెట్టిన నల్లపురెడ్డి శ్రీనివాసులు రెడ్డి గారి పేరును తొలగించడం అన్యాయమన్నారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత పేర్లు మార్చడం తప్ప, రైతులకు చేసిందేమీ లేదు. సోమశిల మరమ్మతులకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలోనే పునాది పడింది. 1995 నాటి చంద్రబాబుని చూస్తారని ఒకసారి, మారిన చంద్రబాబును చూస్తారని ఒకసారి చంద్రబాబు చెప్తున్నాడు. 1995లో చంద్రబాబు ట్రాక్ రికార్డ్ బాగా లేదు..అందుకే ప్రజల్లో ఆందోళన కలుగుతోంది. యన్.టి.ఆర్.గారు ప్రధాన హామీలైన 2రూ?? లకే కిలో బియ్యం, సంపూర్ణ మద్యపాన నిషేధాన్ని అమలు చేస్తే, వాటికి చంద్రబాబు తూట్లు పొడిచాడు. ఇచ్చిన మాటను తుంగలో తొక్కిన 1995 చంద్రబాబు అంటే ప్రజలు భయపడుతు న్నారు. చంద్రబాబు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలపై ప్రజలు అమలు చేస్తాడో, లేదో అని ఆందోళన మొదలైంది. సోమశిల జలాశయం మరమ్మత్తు పనులను పూర్తి చేయడంతో పాటు, బ్యారేజీలకు గత ప్రభుత్వం నామకరణం చేసిన విధంగా తిరిగి ఆ పేర్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తున్నామని ఈ సందర్భంగా మాట్లాడారు.

# ప్యాలెస్‌లో కూర్చుని తప్పుడు ట్వీట్లు పెట్టడానికి సిగ్గులేదా జగన్?

**వైఎస్ జగన్ ది ఫేక్ రాజకీయం**

**వెలుగొండ ప్రాజెక్టుపై నువ్వు మాట్లాడుతే దెయ్యాలు వేదాలు వల్లించినట్లుంది**

**జగన్‌కు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి కౌంటర్**



(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, ఆగస్టు 20)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చరిత్రలో జలవనరుల శాఖ అత్యంత నిర్లక్ష్యానికి, విధ్వంసానికి గురైంది జగన్ హయాంలోనే అని, ఈ విషయం దాస్తే దాగదు అని గిద్దలూరు టీడీపీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి అన్నారు. వెలుగొండ ప్రాజెక్టుపై ట్విట్టర్‌లో జగన్ చేసిన ట్వీట్ కు ఎమ్మెల్యే అశోక్ రెడ్డి ఘాటుగా స్పందించారు. వెలుగొండ ప్రాజెక్టు గురించి పులివెందుల ఎమ్మెల్యే జగన్ రెడ్డి మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. ఫేక్ రాజకీయంతో లబ్ధి పొందాలనుకునే జగన్ దుర్మార్గపు ఆలోచనలను ప్రజలు విశ్వసించరన్నారు. గత ఐదేళ్లలో మిగిలిన 10 నుండి 20 శాతం పనులు పూర్తిచేసి వెలిగొండ ద్వారా నీళ్లివ్వలేకపోయిన నువ్వు నేడు బెంగళూరు యలహంక ప్యాలెస్‌లో కూర్చుని ట్వీట్లు చేయడానికి సిగ్గనిపించడం లేదా అని నిలదీశారు. సలహాదారులకు, సాక్షి పత్రికకు, సర్వే రాళ్లపై బొమ్మలకు చేసిన ఖర్చు ఎంతో...సాగునీటి ప్రాజెక్టులకు ఖర్చు చేసింది ఎంతో దమ్ముంటే ప్రకటించాలని సవాల్ విసిరారు. సాగునీటి రంగానికి, రాష్ట్ర రైతాంగానికి జగన్ ఐదేళ్ల పాపపు పాలన ఒక శాపంగా మారిందన్నారు. ఈ సంగతి ఫేక్ రాజకీయం చేసే, అంతరాత్మే లేని జగన్‌కు తప్ప రాష్ట్రంలోని ప్రతి పౌరుడికీ తెలుసన్నారు. తప్పుడు ప్రచారంతో ఎల్లకాలం రాజకీయం సాగదు అని జగన్ గుర్తుంచుకోవాలని హితవు పలికారు.

# నారా లోకేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన జూలకంటి



(షణ్ముఖ వెలుగు, మాచర్ల టౌన్, ఆగస్టు 20)

మంత్రి నారా లోకేష్ ను మాచర్ల ఎమ్మెల్యే జూల కంటి బ్రహ్మానందరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. తాడేపల్లి మండలం ఉండవల్లిలోని లోకేష్ నివాసంలో ఆయనను జూలకంటి బ్రహ్మానందరెడ్డి కలిసి మాచర్ల పట్టణంలోని పరిస్థితులను గురించి, అభివృద్ధి పనులను గురించి, అన్నా క్యాంటీన్ నిర్వహణ గురించి, మాచర్ల మున్సిపాలిటీ అభివృద్ధి వంటి పలు అంశాలను గురించి చర్చించారు. నారా లోకేష్ సానుకూలంగా స్పందించి మాచర్ల నియోజకవర్గం అభివృద్ధికి తన వంతు సహాయ, సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు.

# నా కార్యక్రమాల్లో ఎక్కడా హంగు, ఆర్భాటాలు వద్దు



(షణ్ముక వెలుగు, నెల్లూరు, ఆగస్టు 20)

నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 20వ డివిజన్, వనంతోపు సెంటర్‌లో సుమారు 33 లక్షల రూపాయల నిధులతో సిసి డ్రైన్ పనులకు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి , టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నా కార్యక్రమాలలో ఎక్కడైనా ఫ్లెక్సీలు కట్టినా, బొకేలు, శాలువాలు ఇచ్చినా, టపాసులు కాల్చినా ఆ కార్యక్రమానికి నేను హాజరు కానని తెలిపారు. రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు ఎక్కడపడితే అక్కడ కట్టినదాని వల్ల ప్రజలకు, చిన్న చిన్న వ్యాపారస్తులకు ఇబ్బందులు తలెత్తున్నాయని, అందుకు గాను నా కార్యక్రమాల్లో ఫ్లెక్సీలు, బొకేలు, శాలువాలు చేసే బదులు పది మందికి అన్నం పెట్టే అన్న కాంటీన్‌లకు విరాళం ఇవ్వండని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ చేజర్ల మహేష్, క్లస్టర్ ఇంచార్జ్ కంటే సాయిబాబా, టీడీపీ నాయకులు ఖాదర్ బాషా, పోతురాజు రవి, అన్నంగి రమణయ్య, మనుబోలు రవీంద్ర రెడ్డి, గంటా డేవిడ్, దిలీప్ రెడ్డి, మధుసూధన రావు, కృష్ణయ్య, నారాయణ, శీనయ్య, కొండయ్య, విష్ణు, శశి, కే హేమ సుందర్ రెడ్డి, భాస్కర్ నాయుడు, దయాకర్ గౌడ్, శ్రీకాంత్, వెంకటేష్, చేజర్ల కవిత, పద్మజ యాదవ్, హెప్సీబా, శిరీష, అల్లం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## డేటాల్ హ్యాండ్ వాష్‌పై అవగాహన






**(షణ్ముఖ వెలుగు, నర్సరావుపేట, ఆగస్టు 20)** నర్సరావుపేటలోని కస్తూరిభా గాంధీ బాలికల విద్యాలయంలో డేటాల్ బానేగా స్వస్తి ఇండియా కార్యక్రమంలో భాగంగా గ్రామాలయ, సార్డ్ సంస్థ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ టీ. లక్ష్మి ఆధ్వర్యంలో విద్యార్థులకు డేటాల్ హ్యాండ్ వాష్ అంశం పై డిజిటల్ క్లాస్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. పాఠశాల విద్యార్థిని లు చేతులు శుభ్రంగా పద్ధతులు ద్వారా పాటించాలి అని అవగాహన కార్యక్రమం చేయడం జరిగింది. డేట్టోల్ సబ్బులు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ప్రమీల రాణి, టీచర్స్ , విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎంపీ మాగుంట పర్యటన వివరాలు



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 20)** ఒంగోలు పార్లమెంటు సభ్యులు, మాగుంట శ్రీనివాసులు రెడ్డి ఈ నెల 22,23, 24వ తేదీలలో జరుపు పర్యటనా కార్యక్రమ వివరాలు వెల్లడించారు. ఈ నెల 22వ తేదీన ఉదయం 8.00 గంటలకు ఒంగోలులో మాగుంట కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారన్నారు. ఉదయం 10 గంటలకు ఒంగోలులో క్రొత్త కూరగాయల మార్కెట్ ఎదురుగా నున్న రెడ్ క్రాస్ సొసైటీలో సినీ హీరో, చిరంజీవి పుట్టినరోజు వేడుకల సందర్భంగా ప్రకాశం జిల్లా చిరంజీవి యువత నిర్వహించే ఉచిత రక్తదాన కార్యక్రమంలో పాల్గొంటారు. ఉదయం 10.30గంటలకు ఒంగోలు సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ 1 వద్ద నవోదయ స్కూలుకు వెళ్ళు నీటి పైపు లైన్ శంకుస్థాపన కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ తో కలసి పాల్గొంటారు. ఉదయం 11.30గంటలకు ఒంగోలులో ప్రకాశం భవనంలో జాయింటు కలెక్టర్ కార్యాలయంలో ఒంగోలు విమానాశ్రయం ఏర్పాటుపై జరుగు సమావేశంలో ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌తో కలసి పాల్గొంటారు. మధ్యాహ్నం 1గంటకు ఒంగోలులో మాగుంట కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారన్నారు. ఈ నెల 23వ తేదీన ఉదయం 8గంటలకు ఒంగోలులో మాగుంట కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారన్నారు. ఉదయం 10గంటలకు ఒంగోలులో జరిగే స్థానిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. సాయంత్రం 3గంటలకు గిద్దలూరు పట్టణంలో రాచర్ల గేటు వద్ద రైల్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించి రైల్వే గతి శక్తి, రెవెన్యూ, విద్యుత్, మునిసిపాలిటి, రోడ్డు భవనాల శాఖల అధికారులతో జరిగే సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డితో కలిసి పాల్గొంటారన్నారు. సాయంత్రం 8.30గంటలకు ఒంగోలులో జరుగు స్థానిక కార్యక్రమాలలో పాల్గొంటారు. ఈ నెల 24వ తేదీన ఉదయం 8గంటలకు ఒంగోలులో మాగుంట కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. ఉదయం 10గంటలకు ఒంగోలులో మునిసిపల్ కార్పోరేషన్ కార్యాలయంలో ఒంగోలు పార్లమెంటు సభ్యులు, ఎమ్మెల్యే, కార్పోరేషన్ ఎక్స్ ఆఫీసియో సభ్యులుగా ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొంటారు.

## మంత్రి నారా లోకేష్‌ని కలిసిన ఎరిక్షన్ బాబు

### యర్రగొండపాలెం నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తాం విద్యాశాఖ మంత్రి నారా లోకేష్



**(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం ఇన్‌ఛార్జి, ఆగస్టు 20)** రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ బాబుని మంగళవారం ఉండవల్లిలోని ఆయన నివాసంలో యర్రగొండపాలెం నియోజకవర్గ టిడిపి ఇన్ చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా ఎరిక్షన్ బాబు మంత్రి నారా లోకేష్‌ని దోర్నాలలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు స్థల, భవనం, హాస్టల్ నిర్మాణానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. త్రిపురాంతకం శ్రీ బాలత్రిపురసుందరీ దేవి అమ్మవారి సన్నిధిలోని సాగర్ కాలువ డబుల్ రోడ్ బ్రిడ్జి నిర్మాణానికి సహకరించాలని కోరారు. నియోజకవర్గంలోని అన్ని చెంచు గూడెంలలో రోడ్లు, మౌళిక వసతుల కల్పన కోసం కృషి చేయాలని కోరినట్లు తెలిపారు. ఎరిక్షన్ బాబు వినతులను నారా లోకేష్ బాబు సానుకూలంగా స్పందించి వినతులను పరిష్కరించి యర్రగొండపాలెం నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారన్నారు.

# అర్హులైన వారందరికి ఓటు హక్కు కల్పించండి

## కమిషనర్ సూర్యతేజ



**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఆగస్టు 20)** నగర పాలక సంస్థ పరిధిలోని నెల్లూరు సిటీ 117 నియోజకవర్గంలో 1-1-25 తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతను గుర్తించి, వారందరికీ ఓటు హక్కు నమోదు చేయించాలని కమిషనర్, ఈ.ఆర్.ఓ సూర్యతేజ ఎన్నికల విభాగం అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. ఎన్నికల విభాగం అధికారులు, సూపర్ వైజర్లు, బూత్ లెవెల్ అధికారులతో "స్పెషల్ సమ్మరీ రివిజన్ ఆఫ్ ఎలెక్టోరల్ రోల్స్ - 2025" సమీక్షా సమావేశాన్ని కార్యాలయం కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ.ఆర్.ఓ మాట్లాడుతూ ఆన్లైన్ ద్వారా అందుకున్న అన్ని దరఖాస్తులను పారదర్శకంగా విచారించి అర్హులను గుర్తించాలని సూచించారు. అర్హులైన వారి నమోదుకు జాబితాలను సంబంధిత ఉన్నతాధికారులకు నివేదించాలని సూచించారు. బి.ఎల్.ఓ లు తమ పరిధిలో ఇంటింటి సర్వే నిర్వహించి వివరాలను సేకరించాలని, కుటుంబ సభ్యులంతా ఒకే పోలింగ్ కేంద్రంలో నమోదయ్యేలా జాగ్రత్తలు వహించాలని సూచించారు. స్థిర నివాసం లేని వారు, సంచార జాతి ప్రజలను గుర్తించి ఓటరు నమోదుకు అవకాశాలను పరిశీలించాలని సూచించారు. దివ్యాంగులు, వయో వృద్దులను గుర్తించి వారి వివరాలను ప్రత్యేకంగా నమోదు చేయాలని ఈ.ఆర్.ఓ సూచించారు. క్షేత్ర స్థాయి సిబ్బంది సేకరించిన వివరాలను ఉన్నతాధికారులు పారదర్శకంగా పరిశీలించాలని, వివరాల పరిశీలనకు స్వయంగా గృహాలను సందర్శించి ఓటర్లతో ప్రత్యక్షంగా మాట్లాడాలని ఈ.ఆర్.ఓ సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో ఏ.ఈ.ఆర్.ఓలు దేవీకుమారీ, షఫీ మాలిక్, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

# భూముల ఫ్రీహోల్డ్ వెరిఫికేషన్









**(షణ్ముఖ వెలుగు, కనిగిరి, ఆగస్టు 20)** మండలంలో భూముల ఫ్రీహోల్డ్ వెరిఫికేషన్ జరిగిన ప్రక్రియను చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ (సి.సి.ఎల్.ఏ) జి.జయలక్ష్మి పరిశీలించారు. భూముల ఫ్రీహోల్డ్ వెరిఫికేషన్‌ను పరిశీలించడానికి కనిగిరి మండలాన్ని పైలెట్ ప్రాజెక్ట్ తీసుకుని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, స్థానిక ఆర్.డి.ఓ. జాన్ ఇర్విన్లతో కలిసి మంగళవారం కనిగిరి మండలంలో ఆమె పర్యటించారు. శంఖవరం గ్రామంలోని సర్వే నెం.562/4 లోని భూములను సి.సి.ఎల్.ఏ. పరిశీలించారు. ఆ భూముల రైతులతోనూ, పరిసర వ్యవసాయదారులతోనూ ప్రత్యేకంగా మాట్లాడారు. వీటికి సంబంధించిన వివరాలను అధికారులు ఈ సందర్భంగా సి.సి.ఎల్.కు వివరించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో అధికారులతో ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఫ్రీహోల్డ్ వెరిఫికేషన్‌కు సంబంధించిన ఫైళ్లను, దీనికి అనుసరించిన విధానాన్ని ఆమె పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్న నేపథ్యంలో పాత వెరిఫికేషన్లో ఏమైనా తప్పులు ఉంటే వాటిని ఏ విధంగా సరిచేయాలనే అంశాలపై సిబ్బందికి ఆమె దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ భూములు ఎట్టి పరిస్థితులలోనూ ఆక్రమణకు గురికాకుండా చూడాలని అధికారులకు సి.సి.ఎల్.ఏ. స్పష్టం చేశారు. ఈ పర్యటనలో వారి వెంట డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ శ్రీరాములు, తహసీల్దార్ అశోక్ రెడ్డి, మండల సర్వేయర్ వైష్ణవి, ఇతర అధికారులు ఉన్నారు.

# ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియను మండలానికి పరిమితం చేయాలి

## ఆపస్



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 20)** ఉపాధ్యాయుల సర్దుబాటు జరుగుతున్న కొద్ది రోజు రోజుకు ఉపాధ్యాయులలో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతున్నదనీ, ముఖ్యంగా సర్దుబాటు మండల స్థాయిలోనే పూర్తి చేసి, తర్వాతనే డివిజనల్ స్థాయిలో ఉపాధ్యాయుల అంగీకారంతో జరపాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర సంఘటనా కార్యదర్శి సిహెచ్ శ్రావణ కుమార్, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె .మల్లికార్జునరావు, టి.దిలీప్ చక్రవర్తి ఒక ప్రకటనలో కోరారు. మండల స్థాయిలో ఎస్జీటీల అవసరం ఉన్నప్పటికీ ముఖ్యంగా క్వాలిఫైడ్ ఎస్జీటీలను బలవంతంగా ఇష్టం లేకపోయినప్పటికీ ఉన్నత పాఠశాలకు కేటాయిస్తున్నారు. గతంలో ఇదే అర్హత కలిగినప్పటికీ ప్రమోషన్ వద్దనుకున్న ఎస్జీటీలను ప్రస్తుతం బలవంతంగా ఉన్నత పాఠశాలకు పంపించడం సరికాదు. ఎస్జీటీలను ఉన్నత పాఠశాలలకు సర్దుబాటు చేసే విషయంలో వారి ఇచ్చికాన్ని పరిగణలో తీసుకోవాలి. వారికి ఇష్టం లేకుండా బలవం తంగా ఉన్నత పాఠశాలలకు పంపడం సరికాదు. గతంలో సర్దుబాటుకు 8 కిలోమీటర్ల పరిధి ఉండేదని, ఎడ్యుకేషన్ క్వాలిఫికేషన్ ఉందని సుదూర ప్రాంతాలకు బలవంతపు సర్దుబాటు చేయరాదనీ అన్నారు. సర్దుబాటు ప్రక్రియను పూర్తిగా మండలానికి పరిమితం చేయాలని ఉపాధ్యాయుల అంగీకారానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఆపస్ తరపున కోరారు.

## నిరాడంబరంగా గోదా గురవవారెడ్డి జన్మదిన వేడుకలు



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 20)** విశ్రాంత జిల్లా గ్రంథాలయ ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షుడు, గోదా గురవవారెడ్డి జన్మదిన వేడుకలు సంతపేటలోని శివం ఫౌండేషన్ శరణాలయంలో నిరాడంబరంగా జరిగాయి. ఈ సందర్భంగా అక్కడ ఉన్న శరణార్దులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా గురవారెడ్డి మాట్లాడుతు ఇంత మంది పేదల దగ్గర నా పుట్టిన జరపుకోవటం నాకు చాలా సంతోషంగా ఉందని అన్నారు. ప్రతి పుట్టిన రోజు ఒక మంచి కార్యక్రమం చేయుచు ముందుకు పోతాను అన్నారు. కార్యక్రమంలో శివం ఫౌండేషన్ ఫౌండర్ శ్రీహరి, విశ్వమానవ సంక్షేమ సంఘం అద్యక్షులు పెసల మస్తాన్ రావు,కమర్షియల్ ట్యాక్స ఆఫీసర్ రావూరి సదానందరావు, క్రియేటివ్ కల్చరల్ అకాడమి అద్యక్షులు పత్రా శివ,ప్రముఖ చలన చిత్రనటుడు నేలపాటీ ప్రసద్ బాబు, ల్యాండ్ మాఫియా డైరెక్టర్ బాబు వి,యన్, గ్రంథాలయ ఉద్యోగి సంపూర్ణా, తదితరులు పాల్గొన్నారు.

## మాతా శిశు మరణాలను తగ్గించడానికి నిర్దిష్టమైన చర్యలు చేపట్టాలి

### వైద్యాధికారులకు జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ ఆదేశాలు



**(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఆగస్టు 20)** మంగళవారం కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో మాతా శిశు మరణాలపై జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సంవత్సరంలో ఇప్పటివరకు జిల్లాలో సంభవించిన ఆరు మరణాల గురించి సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ హై రిస్క్ ఉన్న కేసులను ముందుగానే గుర్తించి ఆధునిక వసతులున్న జి జి హెచ్ లాంటి పెద్ద ఆసుపత్రులకు తరలించాలన్నారు. చివరి నిమిషంలో పి హెచ్ సి ల నుండి పెద్ద ఆసుపత్రులకు రిఫర్ చేయడంవల్ల ప్రాణాలు కాపాడుకునే అవకాశం ఉండదన్నారు. అదేవిధంగా మొదటిసారి చెకప్ కు వచ్చినప్పుడే ఆధార్ కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు లను పరిశీలించి, ఆయా కార్డులు లేనివారికి ఇప్పించుటకు వెంటనే తగు చర్యలు చేపట్టాలన్నారు. అదేవిధంగా పీహెచ్సీ, సిహెచ్సి స్థాయిలోనే పేషంట్ వివరాలను అభ యాప్ లో నమోదు చేయుటకు చర్యలు చేపట్టాలన్నారు. ఇందుకు అవసరమైన మౌలిక వసతులు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా మాతా శిశు మరణాలు సంభవించినప్పుడు ఆయా కుటుంబ సభ్యులకు అవగాహన కలిగించి తప్పనిసరిగా పోస్ట్ మార్టం చేయుటకు కృషి చేయాలన్నారు. ఈ విషయమై వైద్యాధికారులు వ్యక్తిగత శ్రద్ధ తీసుకోవాలన్నారు. అదేవిధంగా సరైన రక్త నిల్వలు అందుబాటులో ఉండేట్లుగా చూసుకోవాలని, అవసరమైతే రెడ్ క్రాస్ సంస్థతో మాట్లాడి ప్రతినెల రక్త సేకరణకు మెడికల్ క్యాంపులు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి పెంచలయ్య, డి సి హెచ్ ఎస్ రమేష్ నాథ్, జి జి హెచ్ సూపరింటెండెంట్ సిద్దా నాయక్ పాల్గొన్నారు.

## ఉచిత పశుగర్భకోశ చికిత్స శిబిరం



**(షణ్ముఖ వెలుగు, పెద్దారవీడు, ఆగస్టు 20)** మండలంలోని చింతకుంట్ల గ్రామంలో పశుగణాభివృద్ధి సంస్థ, పశు సంవర్ధక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ వారి సౌజన్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకులు డాక్టర్ యోగానంద ప్రసాద్ మాట్లాడుతూ ఎదకురాని గేదెలను చూలు కట్టే విధంగా, దూడల సంరక్షణ రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు, ఏడాదికి ఒక దూడ ఎలా ఎలా పొందాలి అనే విషయాలను రైతులకు తెలిపారు, అనంతరం గాలికుంటు టీకాల కార్యక్రమం కూడా నిర్వహించారు ఈ కార్యక్రమంలో పశు గణాభివృద్ధి సంస్థ ఈఓ డాక్టర్ రవికుమార్, మార్కాపూర్ సహాయ సంచాలకులు డాక్టర్ బాలు నాయక్, కొండేపల్లి పశువైద్యాధికారి డాక్టర్ జి లీనా గ్రేస్, గజ్జలకొండ పశువైద్యాధికారి డాక్టర్ అశోక్ కుమార్, తర్లపాడు పశువైద్యాధికారి డాక్టర్ నందన, కలుజువ్వలపాడు పశువైద్యాధికారి డాక్టర్ సౌజన్య, 50 మంది పశు పోషకులు ఈ కార్యక్రమంలో లబ్ధి పొందారు.

# తక్షణమే నిర్వాసితులకు ఆర్అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వాలి

## ఆర్.బి.ఐ నుంచి 15 వేల కోట్లు నిధులు అప్పుగా తీసుకున్నారు

## నిర్వాసితులకు 1200 కోట్లు కొట్టడానికి డబ్బులు లేవు

## మీడియాతో వైపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్



(షణ్ముఖ వెలుగు, మార్కాపురం ఇన్ఛార్జి, ఆగస్టు 20)

వెలుగొండ ప్రాజెక్ట్ ముంపు గ్రామాలలో అర్హులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ వర్తింపు చేయాలని యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ఉన్నారు. సోమవారం పెద్దారవీడు మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే చంద్రశేఖర్ హర్షం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం కేవలం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మీద నిందలు వేయడానికి, ప్రభుత్వ ఆఫీసుల్లో ఉన్నటువంటి ఫైలు తగలబెట్టి అవి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తగలబెట్టారని ఈ రాష్ట్ర ప్రజల మంచి చెడు ఆరోపణలు, నిందలు వెయ్యడానికే పరిమితం అయిందని అన్నారు. మంగళవారం రాష్ట్ర అభివృద్ధి చేయటం మానేసి కేవలం ప్రచారాలు చేసుకోవడం మాత్రమే చేస్తున్నారు అన్ని మండిపడ్డారు. ఈ విధంగా గతంలో దివంగత మహానేత రాజశేఖర్ రెడ్డి పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్ట్ ను శంకుస్థాపన చేసి ఒక టన్నెల్ను దాదాపుగా సగం కంప్లీట్ చేస్తే ఆ తర్వాత వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం దాన్ని పూర్తిగా గాలికి వదిలి వేసి దానిమీద ఏ విధంగా ఇంపార్టెన్స్ ఇవ్వకపోతే 2019 లో మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం లో దాదాపు పూర్తి చేశారన్నారు. మా ప్రభుత్వం పూర్తి చేసి వాటర్ ని స్టోర్ చేసుకునే అద్భుతమైన ప్రాజెక్ట్ను మీ చేతిలో పెడితే ఉచితంగా ఫ్రీగా వాటర్ వచ్చేటటువంటి అవకాశం ఉన్నప్పుడు దాన్ని నింపుకోవాల్సిన బాధ్యత ఎత్తి వేసిన మీ ప్రభుత్వం అది ఒప్పుకోకుండా కేవలం ప్రచారాల కోసం తప్పు అభివృద్ధి ఏమి జరగటం లేదని విమర్శించారు. వెలుగొండ ప్రాజెక్ట్ కు వచ్చి మీటింగులు పెట్టి వెళ్లిపోయారు తప్ప ఏమీ వరిగింది లేదన్నారు.నీరు విడుదల చేస్తారా చేయరా ఎప్పుడు చేయబోతున్నారు. ఇప్పుడు ప్రాజెక్ట్ నుంచి పోతున్న నీరు సముద్రాలకి వృథాగా వెళ్ళిపోతుంది. అటుపైన శ్రీశైలం గేట్లు ఎత్తారు, నాగార్జునసాగర్ గేట్లు, ఎత్తారు ఆ తర్వాత ప్రకాశం బ్యారేజ్ గేట్లు ఎత్తేసి సముద్రంలోకి వదులుతుంటే ఏమి చేస్తుంది ఈ కూటమి ప్రభుత్వం అన్నారు. ఇంత అమూల్యమైన వాటర్ వృథాగా పోతుంటే పట్టించుకోలేదు. వెలుగొండ ప్రాజెక్ట్ నిర్వాసితులకు కేవలం 1200 కోట్ల రూపాయలు రిలీజ్ చేసి, వారిని తగిన నిర్వాసిత కాలనీలకు పంపించాలని అన్నారు. ఇక్కడ తాగునీటికి సంబంధించినటువంటి పూర్తి సమస్యల్ని పూర్తి చేయాలి అన్నారు. 4 లక్షల 50 వేల ఎకరాలకి సాగునీరు అందించే ప్రాజెక్టు మూడు జిల్లాలకి వాటర్ అందించే ప్రాజెక్టు దాదాపుగా 15 లక్షల మందికి తాగునీటి అందించేటటువంటి ప్రాజెక్ట్ని ఇలా నిర్వీర్యం చేయడం తగదన్నారు. ఈ పశ్చిమ ప్రాంతం ప్రజల తరఫునుంచి ప్రభుత్వాన్ని రిక్వెస్ట్ చేస్తున్నాను రాజకీయాలు పక్కన పెట్టండి ప్రజలకు మేలు చేసే ప్రభుత్వంలో ఉన్నారు. గతంలో అనేక ప్రభుత్వాలు కంప్లీట్ చేయనటువంటి ప్రాజెక్టులు మా ప్రభుత్వం వచ్చిన తర్వాత గండికోట గండికోటకి తెలుగుదేశం పార్టీ ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇవ్వకుండా వెళ్ళిపోతే గండికోటకి మా ప్రభుత్వం డబ్బు ఇచ్చాం. ఆ ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం మేము చర్యలు తీసుకున్నాం. ప్రాజెక్టలను కంప్లీట్ చేయటమే వైసీపీ ప్రభుత్వం పూర్తి చేయడమే వారికి నచ్చని పని అన్నారు. ఇవాళ అన్న క్యాంటీన్ల పేరుతో ప్రచారం లేదా ఇంకొక కార్యక్రమం పెన్షన్లు ఒకవైపున ఏరి వేస్తూ లబ్ధిదారుల సంఖ్య తగ్గిస్తూ ఘనీయంగా మళ్ళీ పెన్షన్ పెంచి ఇస్తున్నాం అనే దుష్ప్రచారం చేసుకోవడం ఇలాంటి కార్యక్రమాలు తప్ప ఈ రాష్ట్రంలో జరుగుతున్న హత్యాకాండల మీద ఈ రాష్ట్రంలో జరుగుతున్న మానభంగాలపై స్పందించిన దాఖలాలలు లేవని విమర్శించారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో ఓ మహిళపై అత్యాచారం చేసి రేప్ చేస్తే పెద్ద ఎత్తున దేశం మొత్తం కూడా గళం ఎత్తి చాటుతుంది ఇక్కడ ఒక చిన్న బిడ్డని చంపేస్తే ఈరోజు వరకు కూడా శవం దొరక్కపోతే ఈ ప్రభుత్వానికి నిమ్మకి నీరు ఎత్తినట్టు ఉంది. దాదాపు 17000 ఎకరాలు మాత్రం ఈ మండలంలో సాగు జరిగింది. ఈ రోజు ఎందుకు అంటే వర్షపాతం లేకపోవడం అంటారు కావలసినంత వాటర్ అందుబాటులో ఉంది డాం కంప్లీట్ చేసింది. దానిలో వాటర్ గాని వదిలేస్తే ఐదు మండలాలు సస్యశ్యామలమవుతాయి. దాంతోపాటు పక్కనున్న కడపకు వాటర్ వెళుతుంది. పక్కనున్న ఇంకొక జిల్లా నెల్లూరు జిల్లా కూడా వాటర్ అందించే బ్రహ్మాండమైన ప్రాజెక్ట్ వస్తుంది. పొలాలకు మంచినీరు సదుపాయం కలుగుతుంది. ప్రజల వైపున ఆలోచిస్తే ప్రభుత్వం కచ్చితంగా చేయాలి తప్పదు. కానీ ప్రజల వైపున కాకుండా కేవలం ఒక పార్టీ తరఫున ఆలోచిస్తున్నారు. కాబట్టి ఇది చేయకుండా దాటవేస్తున్నారు. నిజంగా చంద్రబాబు నాయుడుకి ఒక మంచి అవకాశం. ఇక్కడ పశ్చిమ ప్రాంత ప్రజలకి ఈ యొక్క ప్రాజెక్టుకు వాటర్ ఇచ్చి వారిని ఆదుకోవాల్సిన అవసరం ఉంది. వారికి మంచి అవకాశం ఉంది. వారు ఆ విధంగా ఆ దిశగా అడుగులు వేసి ఆ వాటర్ వదలాలని, ఇక్కడ ప్రాంత ప్రజల యొక్క కలల్ని నెరవేర్చాలని ఇక్కడ ప్రజలందరూ కూడా కోరుకుంటున్నారన్నారు. ఈ ప్రాజెక్టు కంప్లీట్ అయినప్పుడే ఈ వర్షాలు గాని వస్తే ఖచ్చితంగా ఈ ప్రాజెక్టు రావడం వలన ఇక్కడ పొలాలు గానీ, తాగునీటి సమస్య కానీ వ్యవసాయంగాని బ్రహ్మాండంగా చేసుకోవచ్చని ఆశపడ్డారు. మా ప్రభుత్వం గానీ వచ్చినట్టయితే కచ్చితంగా చేసేవాళ్లం అన్నారు. ఇవాళ చంద్రబాబు నాయుడు 15 వేల కోట్ల రూపాయలు ఆర్బీఐ దగ్గర నుంచి అప్పులు తెచ్చారు. 1200 కోట్లు ఇవ్వడానికి డబ్బు లేదా పదిహేను వేల కోట్లు ఆర్బీఐ దగ్గర నుంచి తెచ్చినటువంటి డబ్బు ఏమైపోయింది. ఇంత బ్రహ్మాండమైన మూడు జిల్లాలకు సంబంధించినటువంటి ప్రాజెక్టుని మీరు స్టార్ట్ చేయడానికి ఇంత మంచి అవకాశం ఉంటే వృధాగా వాటర్ ని సముద్రానికి వదిలేస్తున్నారు తప్ప ఈ వైపున ఎందుకు ఆలోచించట్లేదు. ప్రజలు కోరుకుంటుంది మంచి ప్రభుత్వాన్ని ప్రజలు కోరుకుంటుంది గుక్కెడు నీళ్ళని కాబట్టి ఆ వైపుకు ఆలోచించాలి.ఈ ప్రభుత్వం మొద్దు నిద్రని లేవాలి లేచి ఈ ప్రాజెక్టు లోని నిర్వాసితులకు తొరగా ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇచ్చి తరలించాలని అన్నారు. తాగు, సాగునీరు ఇక్కడ నింపాలని ప్రభుత్వాన్ని కూడా కోరుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ బెజవాడ పెద్ద గురవయ్య, కన్వీనర్ కృష్ణారెడ్డి ,జెడ్పిటిసి చలమారెడ్డి, మాజీ జెడ్పిటిసి జగ్గంపూడి వెంకటరెడ్డి,గ్రామ సర్పంచి చెన్నమ్మ, సర్పంచులు ఎంపిటిసిలు, వైసిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## నన్ను బతకనివ్వరా గీతం రికార్డింగ్

### కలకత్తా దుర్ఘటన నేపథ్యంలో రచన

### త్వరలో ఈ పాట విడుదల

### ప్రజా గాయకుడు నూక తోటి శరత్ బాబు





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 20)

పశ్చిమ బెంగాల్ కలకత్తా నగరంలో యువ డాక్టర్ మౌనితపై జరిగిన అత్యాచారం హత్యపై యావత్ భారతదేశ దిగ్భ్రాంతికి గురైన విషయం తెలిసిందే. ఆ ఘటనపై దేశవ్యాప్తంగా ఆందోళనలు జరుగుతున్న నేపథ్యంలో ఒంగోలులో కూడా నగరంలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్, వైద్య విద్యార్థులు, మెడికల్ సిబ్బంది పలు ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు నిరసన చేపట్టాయి. ఈ సందర్భంగా దుండగుల చేతిలో హత్య కావించబడ్డ మౌనిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ జరుగుతున్న దారుణ ఘటనల నేపథ్యంలో ప్రముఖ కవయిత్రి, నరసం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సింహాద్రి జ్యోతిర్మయి రాసిన నన్ను బతకనివ్వరా అనే గీతాన్ని ప్రజా గాయకుడు నూక తోటి శరత్ బాబు గానం చేయగా, విజయవాడ సంగీత దర్శకులు వెస్లీ రికార్డింగ్ స్టూడియోలో రికార్డు చేయడం జరిగింది. రెండు మూడు రోజుల్లో ఈ పాటను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు ప్రజా గాయకుడు నోకితోటి శరత్ బాబు తెలిపారు. ఈ ఘటనకు సంఘీభావంగా ఆందోళన చెంది ఈ గీతాన్ని రాసినట్లు, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను ప్రభుత్వాలు కట్టడ చేయాలని కోరుతూ ఈ గీతం వ్రాయటం జరిగిందని సింహాద్రి జ్యోతిర్మయి తెలిపారు. త్వరలో వైద్య విద్యార్థుల,వైద్యుల,ప్రజాసంఘాల సమక్షంలో దృశ్య గీతాన్ని చిత్రీకరించిన ఈ గీతం ప్రదర్శింపబడుతుందని వారు పన్నుల

## ఒక గొప్ప వ్యక్తి ఆశయాలను ముందుకు నడిపిస్తే ఇంతటి ప్రేమ అభిమానమా....

### మళ్లీ జన్మంటూ ఉంటే జన సైనికుడు గానే పుడతా

### పవన్ కళ్యాణ్ ఫాలోవర్ గానే ఉంటా

### జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్







(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఆగస్టు 20)

జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ జన్మదిన సందర్భంగా నెల్లూరు సిటీ గాంధీ బొమ్మ వద్ద అభిమానుల మధ్య భారీ కేక్ కట్ చేసి సందడి చేసారు. ఈ సందర్భంగా కిషోర్ మాట్లాడుతూ ఓ వ్యక్తిని అభిమానిస్తే... ఎంతగా ఆరాధిస్తారో మా జన సైనికులను చూస్తే తెలుస్తుందన్నారు. జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ బాటలో సామాన్యుడి కి అండగా ప్రశ్నించే గొంతుకకు జనసేన పార్టీ ని వేదికగా పంచికున్నందుకు వస్తున్న ఆదరణ చిరస్మరణీయమన్నారు. అభిమానం, అనురాగం పంచుకోవడానికి రక్తం పంచుకుని పుట్టక్కర్లేదన్నారు. అన్నయ్య ఆశయాలు, లక్ష్యాలకు తోడుగా నడిస్తే కూడా చాలు అని వేలాది జన సైనికులకు వీర మహిళలు నిరూపించారన్నారు. జిల్లా వ్యాప్తంగానే కాకుండా బయట దేశాల్లో స్థిరపడిన జనసైనికులు సైతం ఫోన్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలపడం.పార్టీ తరఫున నిలబడ్డందుకు అభినందనలు తెలపడం సంతోషంగా ఉందన్నారు. జనసేన పార్టీ నెల్లూరు జిల్లాలో బలంగా వినపడుతుందంటే దానికి ఏ ఒక్కరూ కారణం కాదని, పవన్ కళ్యాణ్ ఆశయాలు, సిద్ధాంతాలు దానికి మద్దతుగా నిలుస్తున్న జన సైనికులు, వీర మహిళలే ఈ అభిమానం, ఈ వేడుక జన సైనికులకు వీర మహిళల అంకితమన్నారు.

**నామినేటెడ్ వస్తే పదవుల్లో నిలబడతాం సేవ చేస్తాం...**
**లేకపోతే ప్రజల సమస్యల కోసం కలబడతాం**

నా జనసైనికులు వీర మహిళలు చూపిస్తున్న ఆదరాభిమానాల కంటే ఏవి గొప్పవి కాదు నెల్లూరు జిల్లాలో జనసేన పార్టీ తరఫున ఏ సమస్యకు వచ్చినా అండగా జనసేన నాయకులు అందరూ నిలబడుతామన్నారు. వేడుకను నిర్వహించిన ప్రతి జన సైనికుడు, వీర మహిళకి పేరుపేరునా అభినందనలు తెలుపుతున్నానన్నారు.

## పవన్ కళ్యాణ్ అందించిన సేవాస్ఫూర్తి సమాజానికి ఆదర్శనీయం





(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, ఆగస్టు 20)

ఈ నెల 20వ తేదీన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అందించిన స్ఫూర్తి సమాజానికి ఆదర్శనీయమైనదని ప్రజాకవి డాక్టర్ మొగిలి దేవ అన్నారు. జనసేన ప్రచార కమిటీ జిల్లా కోఆర్డినేటర్ జడా బాల నాగేంద్ర యాదవ్ ఆధ్వర్యంలో స్థానిక కొండయ్య బంకు దగ్గర మంగళవారం జరిగిన డొక్కా సీతమ్మ నిత్య అన్నదాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రజాకవి డాక్టర్ మొగిలి దేవ హాజరయ్యారు. డా.మొగిలి మాట్లాడుతూ “ ఆంధ్రుల అన్నపూర్ణ డొక్కా సీతమ్మ పేరిట జనసేన నాయకులు జడా బాల నాగేంద్ర నిర్విఘ్నంగా గత 34 రోజులుగా పేదలకు అన్నదానం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఆ రోజుల్లో డొక్కా సీతమ్మ 24 గంటలు బాటసారులకు, పేదలకు లేదనకుండా అన్నం పెట్టి ఆకలి తీర్చిన మహోన్నతురాలని కొనియాడారు. గ్రామ స్వరాజ్యం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న దార్శనికుడు,పేదల పెన్నిధి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో ఈ నిత్య అన్నదానం నిర్వహించడం సమాజానికి ఆదర్శంగా నిలుస్తుందన్నారు. దాతలు ఈ మంచి కార్యక్రమానికి సహకరించాలని పిలుపునిచ్చారు”. ఈ కార్యక్రమంలో మరో ముఖ్య అతిథిగా హాజరైన తెలుగుదేశం పార్టీ నాయకులు చంగలశెట్టి అశోక్ కుమార్ మాట్లాడుతూ.. “అన్ని దానాల్లో కెల్లా అన్నదానం మిన్నని ఇంతటి మహత్కార్యం చేపట్టిన జడా బాల నాగేంద్ర అభినందనీయులన్నారు”. అన్నదాన నిర్వాహకులు జడా బాల నాగేంద్ర మాట్లాడుతూ.. “తమ అధినేత పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు పేదలకు ప్రతి నిత్యం 300 మందికి పైగా పెళ్ళి భోజనం లాంటి రుచికరమైన అన్నదానం చేస్తున్నామని, పేదల ఆకలి తీర్చి వారి కళ్ళల్లో కలిగే ఆనందపు వెలుగులు చూసినప్పుడు తనకు ఎనలేని సంతృప్తినిచ్చిందన్నారు. తన శక్తి మేరకు నిరాఘాటంగా నాణ్యమైన అన్నదానం చేస్తానని, దాతలు సహకరిస్తే మరింత విస్తృతంగా నిర్వహిస్తానని తెలిపారు. ఈ సందర్భంగా పేదలకు ముఖ్య అతిథుల చేతులు మీదుగా అన్నదానం వడ్డించారు. ఈ కార్యక్రమంలో కోట సుధాకర్ బాబు, పువ్వాడ శ్యామ్, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

## వసూళ్లను వేగవంతం చేయండి

### కమిషనర్ సూర్య తేజ

(షణ్ముఖ వెలుగు, జంక్ ఫుడ్ ఐటమ్ చూడండి



(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఆగస్టు 20)

నగర వ్యాప్తంగా పన్నుల వసూళ్ళ ప్రక్రియను ప్రణాళికాబద్ధంగా చేయాలని రెవెన్యూ అధికారులు, సిబ్బందిని నగర పాలక సంస్థ కమిషనర్ సూర్య తేజ ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా మంగళవారం ఉదయం స్థానిక మైపాడు గేట్ కూడలి, జాఫర్ సాహెబ్ కెనాల్, కిసాన్ నగర్, జాకీర్ హుసేన్ నగర్ పార్క్, సుబేదార్ పేట, ఏ.బి.ఎమ్ చర్చ్, గాంధీ బొమ్మ తదితర ప్రాంతాలలో పర్యటించారు. జేవీఆర్ కాంప్లెక్స్ లోని దుకాణదారులతో మాట్లాడి పన్నుల చెల్లింపు వివరాలను అడిగి తెలుసుకున్నారు. సమయానుకూలంగా పన్నులను చెల్లించి ప్రతిఒక్కరూ నగరాభివృద్ధికి సహకరించాలని కమిషనర్ ఆకాంక్షించారు. అనంతరం స్థానిక జాఫర్ సాహెబ్ కెనాల్ ట్యాంక్ బండ్ ను కమిషనర్ పరిశీలించారు. ట్యాంక్ బండ్ పై మొక్కలు నాటి పచ్చదనం పెరిగేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కాలువలో స్థానికులు వ్యర్థాలు వేయకుండా మెష్ లాంటి నిర్మాణాలతో చర్యలు తీసుకోవాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలు వేస్తున్న వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్థానిక పరిసరాలను ప్రజలు శుభ్రంగా ఉంచేలా అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఇంజనీరింగ్ డిప్యూటీ ఈ.ఈ అనిల్ కుమార్, రెవెన్యూ అధికారులు సమద్, కృష్ణ కిషోర్, సచివాలయ అడ్మిన్, శానిటేషన్, అమెనిటీస్ కార్యదర్శులు పాల్గొన్నారు.

## వివాహ రిసెప్షన్ వేడుకలకు హాజరైన ఆదాల

(షణ్ముఖ వెలుగు, నెల్లూరు, ఆగస్టు 20)

నెల్లూరు నగరంలోని శ్రీ కస్తూరి దేవి గార్డెన్లో మంగళవారం సాయంత్రం జక్కా శివకుమార్ రెడ్డి గారి కుమారుడు వివాహ రిసెప్షన్ వేడుకలకు మాజీ మంత్రివర్యులు, నెల్లూరు రూరల్ నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్ఛార్జ్ శ్రీ ఆదాల ప్రభాకర్ రెడ్డి గారు హాజరయ్యారు. ఈ సందర్భంగా రిసెప్షన్ వేడుకలకు హాజరైన ఒంగోలు పార్లమెంట్ సభ్యులు శ్రీ మాగుంట శ్రీనివాసులురెడ్డితో కలిసి మాజీ పార్లమెంట్ సభ్యులు ఆదాల ప్రభాకర్ రెడ్డి గారు నూతన వధూవరులను ఆశీర్వదించారు. నూతన వధూవరులను ఆశీర్వదించిన వారిలో నెల్లూరు విజయ డైరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, జడ్పిటిసి సభ్యులు మల్లు సుధాకర్ రెడ్డి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కొండ్రెడ్డి భరత్ రెడ్డి, పాశం శ్రీనివాస్, బట్టేపాటి నరేంద్ర రెడ్డి, ఏసు నాయుడు, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL 16448. e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com